FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష TGTEL/25/A1964 akankshanews.com తెలుగు సంచలన దిన పత్రిక

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :213 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ శుక్రవారం- 27 - మార్చి - 2026

## మార్కాపురం బస్సు ప్రమాద ఘటన - 14కు పెరిగిన మృతుల సంఖ్య



మార్కాపురం జిల్లాలో ప్రైవేట్ బస్సు దగ్ధం - 14కు మంది సజీవదహనం

ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ఉన్నారని సమాచారం

ప్రైవేటు బస్సు హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించిన అధికారులు

అమరావతి : మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ బస్సు-ఢీకొన్న ఈ ప్రమాదంలో 13 మంది సజీవదహనమవ్వగా, 15 మందికి గాయాలయ్యాయి. ప్రమాద జరిగిన సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారని సమాచారం. క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పలకల క్వారీల వద్ద టిప్పర్ - ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల నుంచి పామూరు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. ప్రైవేటు బస్సు హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా అధికారులు గుర్తించారు. మిగతా..2లో

## శ్రీరామ నవమి శోభాయాత్రకు భారీ భద్రత.. 3000 మంది పోలీసులతో బందోబస్తు




శ్రీరామ నవమి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న శోభాయాత్రకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

వేలాదిమంది భక్తులు పాల్గొనే ఈ యాత్రను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

హైదరాబాద్: శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రకు నగర పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సుమారు 3000 మంది పోలీసులతో పాటు టాస్క్ ఫోర్స్, గ్రే హౌండ్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఆక్టోపస్ బలగాలు మోహరించనున్నాయి. శోభాయాత్ర మధ్యాహ్నం 1 గంటకు సీతారాం బాగ్ ఆలయం నుంచి ప్రారంభమవుతుంది. బోయిగూడా కామన్, దూల్‌పేట్, జాలి హనుమాన్, పురానాపూల్, జుమ్మెరాత్ బజార్, చుడీబజార్, బేగంబజార్ ఛత్రి, సిద్ధంబర్ బజార్, పుత్లిబౌలి మార్గంగా హనుమాన్ టేక్డీ వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర కొనసాగుతుంది. మిగతా..2లో

## కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదు.. అసెంబ్లీలో మైక్ కట్ చేయడంపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం




- ★ రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై బీఆర్ఎస్ నేతలు ఘాటుగా స్పందించారు.
- ★ అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేందుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదరాబాద్, మార్చి 26: రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేందుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురాకుండా ప్రభుత్వం

# ఈ రెండు రంగాలకు అత్యంత ప్రాధాన్యం

- ఈ రెండు రంగాలకు కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా కోత విధించే ప్రసక్తే లేదని, అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని అసెంబ్లీ వేదికగా హామీ ఇచ్చారు.
- రాష్ట్రంలోని 35 మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న బోధనాసుపత్రులకు రోగులు వెళ్లడం లేదని, అక్కడ వైద్యుల కొరత ఉందని సీఎం అంగీకరించారు.
- తాము అధికారంలోకి వచ్చే నాటికి గత ప్రభుత్వం రూ. 627 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను మిగిల్చిందని,




అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని అసెంబ్లీ వేదికగా హామీ ఇచ్చారు. గురువారం శాసనసభలో పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు. ఆరోగ్యశ్రీ పథకం కింద బకాయిలు పేరుకుపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులు

హైదరాబాద్: తెలంగాణలో విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ రెండు రంగాలకు కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా కోత విధించే ప్రసక్తే లేదని, మూతపడుతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని సీఎం కొట్టిపారేశారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి గత ప్రభుత్వం రూ. 627 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను మిగిల్చిందని, ఆ భారాన్ని మోస్తూనే పథకం పరిమితిని

## ఒకే ఒక్క క్లిక్.. అరచేతిలో 'భూమి' సమాచారం!

తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని, గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.




హైదరాబాద్: : తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని, గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్(ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను వచ్చే నెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎన్ఐసీ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందికి తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి భూ లావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా పోర్టల్‌ను ఉంటుందన్నారు.

### రిజిస్ట్రేషన్‌కి మ్యాప్...

ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి

## ఇరాన్‌తో యుద్ధం విషయంలో నాటో దేశాల తీరుపై ట్రంప్ ఆగ్రహం




- ★ దశలో కూడా అమెరికాకు నాటో దేశాల నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదని వాపోయారు.
- ★ ఇరాన్‌తో యుద్ధానికి ట్రంప్ ఐదురోజుల పాటు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే.

ఇరాన్‌తో యుద్ధం విషయంలో నాటో దేశాల నుంచి ఎలాంటి మద్దతు లభించడంలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బుల్లెట్ ను పక్కన పెట్టి ఆఫీస్ కు గుర్రంపై వెళ్లిన బ్యాంకు ఉద్యోగి

- ❖ ఇంధన సంక్షోభం వేళ బ్యాంకు ఉద్యోగి విన్నూత ప్రయాణం
- ❖ బైక్ లో ఇంధనం లేకపోవడంతో గుర్రంపై ఆఫీస్ కు వెళ్లిన వైనం




ఢిల్లి : పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో కొన్ని చోట్ల ఇంధన కొరత ఏర్పడిందన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఫలితంగా పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ఎలాగైనా ట్యాంక్ లు ఫుల్ చేసుకోవాలని గంటల తరబడి బంకుల వద్దే పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలో పెట్రోల్ కొరత నేపథ్యంలో మధ్యప్రదేశ్ లో ఓ ఉద్యోగి చేసిన పని వైరల్ గా మారింది. పెట్రోల్ లేకపోవడంతో గుర్రం మీద ఆఫీస్ కు చేరుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. గుర్రం మీద అతడు వెళుతున్న దృశ్యాలను స్థానికులు తమ కెమెరాల్లో బంధించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక వివరాల్లోకి వెళితే, దేవాస్ పట్టణం రాధాగంజ్ ప్రాంతానికి చెందిన గోపాల్ ఠాకూర్ ప్రైవేట్ బ్యాంక్ లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. రోజూ వారిలాగే బ్యాంకుకు బయలుదేరారు. అయితే, తన బుల్లెట్ బైక్ లో సరిపడా పెట్రోల్ లేదు. దీంతో పెట్రోల్ కోసం బంక్ కు వెళ్లాడు. అక్కడ జనం భారీగా క్యూ కట్టి ఉండటం చూసి తిరిగి ఇంటికి చేరుకున్నారు. సమయానికి ఆఫీసుకు లాగైనా చేరుకోవాలని భావించారు గోపాల్ . ఈ క్రమంలో ఆయన ఓ విన్నూతమైన నిర్ణయం తీసుకున్నారు.

గుర్రంపై ఆఫీసుకు వెళ్లిన బ్యాంకు ఉద్యోగి
గుర్రంపై 3 కిలోమీటర్లు
నిర్ణీత సమయంలోపు ఆఫీసుకు చేరుకోవాలని

## రహస్య పొత్తులు రాజకీయ ఎత్తులు

### కేరళలో పొలిటికల్ హీట్- ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ఆరోపణాస్త్రాలు!

- ❖ సీపీఎం సీజేపీగా మారిపోయిందన్న రాహుల్
- ❖ బీజేపీతో సీపీఎం రహస్య డీల్ కుదుర్చుకుందని ఆరోపణ
- ❖ క్రాస్ ఓటింగ్‌కు సీపీఎం, బీజేపీ ప్లాన్ కాంగ్రెస్ నేతలు- కాంగ్రెస్
- ❖ ముస్లిం లీగ్-బీజేపీ కలిసి పనిచేస్తాయ్ : సీఎం విజయన్

ఢిల్లి : అసెంబ్లీ ఎన్నికల వేళ కేరళలో పొలిటికల్ హీట్ పెరిగిపోయింది. మూడు విమర్శలు, ఆరు ఆరోపణలు అన్నట్టుగా రాజకీయ పార్టీలు పరస్పరం తలపడుతున్నాయి. అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్), విపక్ష యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), బీజేపీ మధ్య త్రిముఖ పోరు జరుగుతోంది. రహస్య పొత్తులు, ఓట్ల చీలిక, క్రాస్ ఓటింగ్ గురించి అన్ని పార్టీల నేతల మధ్య వాగ్యుద్ధం జరుగుతోంది. ఇక ఇదే సమయంలో అత్యంత జనాకర్షక ఎన్నికల మేనిఫెస్టోల తయారీకి రాజకీయ పక్షాలు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. అందువల్లే ఇప్పటిదాకా మేనిఫెస్టోలను విడుదల చేయలేదని తెలుస్తోంది.



సీపీఎం సీజేపీగా మారిపోయింది : రాహుల్

తాజాగా కేరళ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన సంచలన వ్యాఖ్యలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. కాంగ్రెస్ సారథ్యంలోని మిగతా..2లో

## ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేవారికి ప్రోత్సాహం - అంగన్వాడీలకు ఇండక్షన్ స్టవ్‌లు




- ★ ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేవారికి ప్రోత్సాహమిస్తామని తెలిపిన మంత్రి నాదెండ్ల మనోహర్
- ★ దీపం పథకం సబ్సిడీ కూడా ఈ పథకానికి వర్తింపు
- ★ రాబోయే రోజుల్లో అవగాహన కార్యక్రమాలు

## రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై మంత్రివర్గ తీర్మానం

- ● ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్-5 సవరించాలని కేబినెట్ తీర్మానం
- ● కొత్త రాజధానిగా సీఆర్డీఏ చట్టం పరిధిలోని అమరావతి పేరు చేర్చాలని తీర్మానం
- ● అసెంబ్లీలో 4 గంటలపాటు రాజధాని అమరావతిపై చర్చించి తీర్మానించాలని నిర్ణయం



అమరావతి : రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేయడమే ప్రధాన అజెండాగా రాష్ట్ర మంత్రివర్గం నేడు సమావేశమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయం మొదటి బ్లాక్ లో ఈ భేటీ జరిగింది. మూడు గంటలపాటు వివిధ కీలక అంశాలపై చర్చించిన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే అంశంపై మంత్రివర్గం తీర్మానం చేసింది. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5ను సవరించాల్సిందిగా తీర్మానం చేసింది. కొత్త రాజధానిగా సీఆర్డీఏ చట్టం పరిధిలోని అమరావతి పేరును చేర్చాలని తీర్మానంలో ప్రస్తావించారు. ఎల్లుండి (మార్చి 28న) అసెంబ్లీలో 4 గంటల పాటు రాజధాని అమరావతిపై చర్చ పెట్టి తీర్మానించాలని నిర్ణయించారు. మిగతా..2లో

## వడ్డెర్లకు మైనింగ్ లీజులు... మరో యువగళం హామీ నెరవేర్చిన లోకేశ్

- ● మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తన యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని
- ● లోకేశ్, తాము అధికారంలోకి రాగానే తప్పకుండా న్యాయం చేస్తామని అప్పట్లో భరోసా ఇచ్చారు.




అమరావతి : రాష్ట్రంలోని వడ్డెర సామాజికవర్గ అభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేసింది. వారి కులవృత్తిని ప్రోత్సహించి, ఆర్థికంగా చేయూతనిచ్చే లక్ష్యంతో వడ్డెర కో-ఆపరేటివ్ సొసైటీలకు ప్రభుత్వ కొండ పోరంబోకు భూముల్లో మైనింగ్ లీజులు కేటాయించాలని నేడు ఏపీ క్యాబినెట్ మంత్రివర్గం నిర్ణయించింది. మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తన యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చే క్రమంలో ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో లోకేశ్ పాదయాత్ర చేస్తున్న సమయంలో పలుచోట్ల వడ్డెర సామాజికవర్గానికి చెందిన సోదరులు ఆయన్ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ కులవృత్తి అయిన రాళ్లు కొట్టడం, మిగతా..2లో

తొలి ఆకాంక్ష



మొదటి పేజి తరువాయి

## వడ్డెర్లకు మైనింగ్ లీజులు... మరో యువగళం హామీ నెరవేర్చిన లోకేశ్

మట్టి పనులు చేసుకుని జీవించేందుకు ప్రభుత్వ ఆధీనంలోని కొండ పోరంబోకు భూముల్లో మైనింగ్ లీజులు కల్పిస్తే తమకు జీవనోపాధి లభిస్తుందని విన్నవించారు. వారి వినతికి సానుకూలంగా స్పందించిన లోకేశ్, తాము అధికారంలోకి రాగానే తప్పకుండా న్యాయం చేస్తామని అప్పట్లో భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, ఇటీవలి కేబినెట్ సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ అంశాన్ని ప్రతిపాదనగా తీసుకువచ్చారు. వడ్డెర సోదరుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఈ ప్రతిపాదనపై నేడు సమగ్రంగా చర్చించిన మంత్రివర్గం, వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు, విధివిధానాలతో త్వరలోనే ప్రభుత్వం అధికారికంగా జీవో (ప్రభుత్వ ఉత్తర్వు) జారీ చేయనుంది. యువగళం పాదయాత్రలో ప్రతిరోజూ వివిధ వర్గాల ప్రజలతో సమావేశమై వారి సమస్యలను లోకేశ్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు, పాదయాత్రలో వివిధ సామాజికవర్గాలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది వడ్డెర కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

## ఈ రెండు రంగాలకు అత్యంత ప్రాధాన్యం

రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 8 నుంచి ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 1,480 కోట్లు కలిపి మొత్తం రూ. 2,408 కోట్లు చెల్లించామని వివరించారు. ప్రస్తుతం చెల్లించాల్సిన రూ. 727 కోట్ల బకాయిల్లో అత్యధికం గత ప్రభుత్వానివేనని తెలిపారు. రాష్ట్రంలోని 35 మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న బోధనాసుపత్రులకు రోగులు వెళ్లడం లేదని, అక్కడ వైద్యుల కొరత ఉందని సీఎం అంగీకరించారు. ఈ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు ఆరోగ్యశ్రీ రోగులను అక్కడికి రిఫర్ చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామన్నారు. వాటి పాలనా పర్యవేక్షణకు గ్రూప్-1 స్థాయి అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. అల్వాల్, ఎల్బీనగర్, సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీలుగా మారుస్తామని, రూ. 3,000 కోట్లతో ఉస్మానియాకు కొత్త భవనం నిర్మిస్తామని ప్రకటించారు. సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి అక్రమాలకు అడ్డుకట్ట వేశామని, ఇప్పటివరకు రూ. 2,046 కోట్లు విడుదల చేశామని చెప్పారు. కులగణన సమాచారం ఆధారంగా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని అందించి భరోసా కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## శ్రీరామ నవమి శోభాయాత్రకు భారీ భద్రత.. 3000 మంది పోలీసులతో బందోబస్తు

### 250 సీసీ కెమెరాలు

యాత్రలో లక్ష మందికి పైగా భక్తులు పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు. మొత్తం 250 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. అదనంగా డ్రోన్ల ద్వారా కూడా యాత్రను నిరంతరం పర్యవేక్షించనున్నారు. పాతబస్తీలోని సున్నిత ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతను మరింత పెంచారు. శాంతి భద్రతలతో పాటు జీహెచ్ఎంసీ ఇతర శాఖలతో కలిసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

### ట్రాఫిక్ ఆంక్షలు

యాత్ర సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ముఖ్యంగా పురానాపూల్, దూల్‌పేట్, బేగంబజార్, నాంపల్లి, అఫ్జల్‌గంజ్, గౌలిగూడ, సుల్తాన్ బజార్ ప్రాంతాల్లో వాహన రాకపోకలను పరిమితం చేశారు. పిక్‌పాకెట్, చైన్ స్నాచింగ్ వంటి ఘటనలు జరగకుండా క్రైమ్ టీమ్‌లు, షీ టీమ్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం మీద భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసులు అన్ని విధాలుగా సిద్ధమయ్యారు.

## ఒకే ఒక్క క్లిక్.. అరచేతిలో 'భూమి' సమాచారం!

జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ పైలెట్ మండలాల్లో మెరిట్- డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండో దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని, ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూ భారతి పోర్టల్‌ను కూడా తీసుకొచ్చామన్నారు. భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ మాదిరిగానే భూధార్ నంబర్‌ను ఇస్తామన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షా లేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నంబర్లను కేటాయించినట్లు తెలిపారు.

### పూర్తి సమాచారంతో పోర్టల్...

ఒక క్లిక్‌తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా, చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదే విధంగా పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మై ల్యాండ్ పోర్ట్ ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్ వంటి పూర్తి సమాచారం ఉంటుందన్నారు. అన్ని రకాల సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూ భారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్ఎంఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్‌తో యుద్ధం విషయంలో నాటో దేశాల తీరుపై ట్రంప్ ఆగ్రహం

ఇన్ని రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇరాన్ మిలిటరీ పరంగా ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. ఈ దశలో కూడా అమెరికాకు నాటో దేశాల నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదని వాపోయారు. వాస్తవానికి ఇప్పటి పరిస్థితుల్లో నాటో దేశాల నుంచి తమకు ఎలాంటి సహకారం అవసరం లేదని ట్రంప్ పేర్కొన్నారు. కానీ ఇలాంటి కీలకమైన సమయాల్లో వారు ప్రవర్తించిన తీరును ఎప్పటికీ మరిచిపోబోమని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌తో యుద్ధానికి ట్రంప్ ఐదురోజుల పాటు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇరాన్‌తో చర్చల ఫలితాన్ని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని తెలిపారు.

## కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదు.. అసెంబ్లీలో మైక్ కట్ చేయడంపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం



అడ్డుపడుతోందన్నారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది. కానీ.. ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, పనులు చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ ఆస్పత్రులన్నీ పూర్తై ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ అదాయంలో వాటాను పెంచి నిధులను సమకూర్చింది' అని అన్నారు.

# రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై మంత్రివర్గ తీర్మానం

మొదటి పేజి తరువాయి

పొట్టి శ్రీరాములు పోరాటం, కర్నూలు రాజధానిగా ఆంధ్ర ఏర్పాటు, హైదరాబాద్ రాజధానిగా ఏపీ ఆవిర్భావం, తెలంగాణ విభజన, అమరావతి ఏర్పాటు ప్రజలకు వివరించాలన్నారు. అమరావతి రాజధానిగా సమర్థించిన జగన్, 3 రాజధానులు నాటకాన్ని ప్రజలకు గుర్తు చేయాలని మంత్రులు సూచించారు. 3 రాజధానుల నాటకంలో నాడు మండలి చైర్మన్ గా ఉన్న షరీఫ్ పై దాడి జరిగినంత పనైందని ప్రస్తావనకు వచ్చింది. ఏపీ పునర్విభజన చట్టం : అమరావతి చట్టబద్ధతపై గతంలో పలు పరిణామాలు జరిగాయి. 2025 మే 8న కేబినెట్ ఆమోదించిన తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మే 12న కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపింది. ఈ తీర్మానాన్ని ఆమోదించాలంటూ రాష్ట్ర అసెంబ్లీలో తాజాగా తీర్మానం చేసి పంపించనున్నారు. ఏపీ పునర్విభజన చట్టం 2014 లోని సెక్షన్ -5 ను సవరించాల్సిందిగా తీర్మానం చేశారు. సెక్షన్ - 5లోని సబ్ సెక్షన్ (2)లో కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలనీ ప్రభుత్వం భావిస్తుంది. 2014 అనే పదాలను చేర్చాలి అని నేడు మంత్రిమండలిలో నిర్ణయించారు. చంద్రబాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ : అదేవిధంగా రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థపై కేబినెట్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. జగజ్జీవన్ రామ్ జయంతి రోజు (ఏప్రిల్ 5) మొదలుకుని అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14) లోపు ప్రతీ నియోజకవర్గంలో 2 వేలు చొప్పున సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పీఎంకుసుమ్ ద్వారా పవర్ లాస్ లు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు 33/11కేవీ సబ్ స్టేషన్ ల వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ సంస్కరణలు తీసుకొస్తూ విద్యుత్ శాఖ ముందుకెళ్లాలన్నారు. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుకు నిర్ణయించారు. ఆదాయంలో 99శాతం జీతాలకే : రాష్ట్ర ఆదాయంలో 99శాతం జీతాలకే సరిపోతోందని, కేంద్రం నుంచి వచ్చే సాయం అప్పులకు వడ్డీలు కట్టేందుకే సరిపోతోందని ఈ సందర్భంగా మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇంతటి క్లిష్టపరిస్థితుల్లోనూ మెరుగైన సంక్షేమం అమలు చేస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్ని ఎక్కువగా మనం ఉపయోగించు

కుంటున్నామని చెప్పారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రాజధానిగా అమరావతి చట్టబద్ధత సవరణ బిల్లు ప్రవేశపెట్టను

న్నారన్నారు. హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం రాజధానికి అనుకూలంగా తీర్పు ఇస్తే రైతులు వాళ్లు వెళ్లే సమయంలో పూలు చల్లి వీడ్కోలు పలికారని గుర్తుచేశారు. వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు : వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో మరో యువగళం హామీని మంత్రి లోకేశ్ నెరవేర్చారు. తాము కులవృత్తి చేసుకుని జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వ కొండ పోరంబోకు భూముల్లో మైనింగ్ లీజులు ఇవ్వాల్సిందిగా పాదయాత్ర సమయంలో వడ్డెరలు లోకేశ్ ను కోరారు. ఇచ్చిన మాట ప్రకారం వడ్డెరలకు మైనింగ్ లీజులు కేటాయించే అంశాన్ని లోకేశ్ క్యాబినెట్ ముందుకు తెచ్చారు. వడ్డెర సోదరుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను పెంచడానికి వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులను కేటాయిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పూర్తిస్థాయి విధివిధానాలతో త్వరలోనే జీవో జారీ చేయనున్నారు. మృతులకు కేబినెట్ సంతాపం : మార్కాపురం బస్సు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల పరిహారం ప్రకటించింది. గాయపడిన వారికి 2 లక్షల సాయం చేస్తామని తెలిపింది. క్షతగాత్రులకు అందిస్తున్న వైద్యసాయంపై మంత్రులు, అధికారులు పర్యవేక్షించాలని క్యాబినెట్ భేటీలో సీఎం ఆదేశించారు. ప్రమాదాల నివారణకు, =&దీ, రవాణాశాఖ, పోలీసు, వైద్యారోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేయాలని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

# ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేవారికి ప్రోత్సాహం - అంగన్వాడీలకు ఇండక్షన్ స్టవ్‌లు

మొదటి పేజి తరువాయి

అమరావతి : యుద్ధం కొనసాగితే భవిష్యత్తులో ఎల్పీజీ సిలిండర్ల కొరత వచ్చే ప్రమాదం ఉన్న దృష్ట్యా ప్రజలకు ఎక్కడా సమస్య రాకుండా మంత్రి వర్గం ముందస్తుగా కీలక చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకుంది. పట్టణాల్లో ప్రస్తుతం ఎల్పీజీ గ్యాస్ వాడుతోన్న వినియోగదారులకు పైప్డ్ నాచులర్ గ్యాస్ వాడేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సీఎం ఆదేశాలతో దేశంలో తొలిసారిగా రాష్ట్రంలో ఎల్పీజీ నుంచి పీఎన్ జీకి మార్పిడిని ప్రారంభిస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కాకినాడ, కర్నూలు నగరాల్లో వినియోగదారులకు పీఎన్ జీ మరింత అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. పర్యావరణహితమైన పైప్డ్ నేచరల్ గ్యాస్ ను ప్రజలు ఎక్కువగా వినియోగించేలా ప్రోత్సహించాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. తిరుమల, విజయవాడ దుర్గగుడి, శ్రీకాళహస్తి, అన్నవరం, సింహాచలం దేవాలయ్యాల్లో పైప్డ్ నేచురర్ గ్యాస్ కనెక్షన్లు తీసుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అన్ని పట్టణాల్లో అన్న క్యాంటీన్లలోనూ పీఎన్ జీ ఏర్పాటు చేయాలని కేబినెట్లో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు.

ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేవారికి ప్రోత్సాహం - సబ్సిడీ నగదు కూడా జమ: మంత్రి నాదెండ్ల

2 నెలలకు ఓ సారి ఖాతాల్లో నగదు జమ: ముందుగా పట్టణాల్లోని అపార్టుమెంట్లలో పైప్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం పీఎన్ జీపై జీఎస్టీని 5 నుంచి 25 శాతానికి పెంచిందన్న మంత్రి పట్టణాల్లో పీఎన్ జీ వినియోగదారులను పెంచేలా, ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. పట్టణాల్లో దీపం పథకంలోని గ్యాస్ కనెక్షన్లను పీఎన్ జీ గ్యాస్ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. దీపం పథకం కింద ఇచ్చే 2,400 రూపాయల ఆర్థిక సాయాన్ని పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్‌కు మారిన వారికీ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని పీఎన్ జీకి మార్పిడి చేసుకున్న వారికి ఉచిత గ్యాస్ సరఫరా పథకం కింద 2 నెలలకు ఓ సారి లబ్దిదారులకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని 6 గ్యాస్ సరఫరా సంస్థలు అదనపు పైప్ లైన్లు వేసే విధంగా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. తొలుత 10 లక్షల ఎల్ పీజీ గ్యాస్ లను పీఎన్ జీ కనెక్షన్లుగా మళ్లించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సీఎం ఆదేశించారని, రాబోయే రోజుల్లో ఎల్ పీజీ కనెక్షన్లను పీఎన్ జీకి మారేలా పౌర సరఫరా శాఖ చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కడా ఎల్ పీజీ సిలిండర్ల కొరత లేదని, పాఠశాలలు సెలవులిచ్చాక ఆ కోటాను వాణిజ్య అవసరాలకు మళ్లించి వారికీ ఇబ్బంది లేకుండా చూస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. "ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేవారికి ప్రోత్సాహమిస్తాం. దీపం పథకం సబ్సిడీ కూడా ఈ పథకానికి అందిస్తాం. రాబోయే రోజుల్లో వగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. సోషల్ మీడియాలో వదంతులను నమ్మొద్దు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదు. కొరత ఉందంటూ వచ్చిన వదంతులు నమ్మి ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. 54 వేల కేంద్రాల్లో 12 వేల అంగన్వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టవ్‌లు ఇప్పటికే ఇచ్చాం. మిగిలిన అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ఇండక్షన్ స్టవ్‌లు ఇస్తాం.'

# రహస్య పొత్తులు- రాజకీయ ఎత్తులు

మొదటి పేజి తరువాయి

యూడీఎఫ్ కూటమిని బలహీనపర్చేందుకు సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ కూటమి, బీజేపీతో రహస్య డీల్‌ను కుదుర్చుకుందని రాహుల్ ఆరోపించారు. ఇప్పుడు సీపీఎం పార్టీ కాస్తా కమ్యూనిస్ట్ జనతా పార్టీ (సీజేపీ)గా మారిపోయిందని ఆయన విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే కాపాడుతున్నారని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కూడా కేరళ వేదికగా ఈ వ్యాఖ్యలనే చేశారు.

### క్రాస్ ఓటింగ్‌కు సీపీఎం, బీజేపీ కసరత్తు

రాహుల్ గాంధీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు కే మురళీధరన్, వీడీ సతీశన్ సమర్థించారు. త్రిస్సూర్, వడకర వంటి కీలకమైన అసెంబ్లీ స్థానాలలో సీపీఎం, బీజేపీల మధ్య క్రాస్ ఓటింగ్ జరిగేందుకు క్షేత్రస్థాయిలో వ్యూహాత్మక ఏర్పాట్లను చేస్తున్నారని వారు ఆరోపించారు. కాసరగోడ్, మంజేశ్వరం, పాలక్కడ్, రణ్ని, కొణ్ని వంటి అసెంబ్లీ స్థానాల్లోనూ ఇదే విధమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్, యూడీఎఫ్ కూటమి అభ్యర్థులను ఓడించేందుకు బీజేపీ, సీపీఎం కుమ్మక్కు అయ్యాయని కే మురళీధరన్, వీడీ సతీశన్ ధ్వజమెత్తారు.

మైనారిటీ ఓట్లను చీల్చేందుకు సీపీఎం ప్లాన్

కేరళలోని ఎల్‌డీఎఫ్ కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని కాంగ్రెస్, యూడీఎఫ్ కూటమిలోని ఇతర పార్టీలు విమర్శిస్తున్నాయి. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన ఎల్‌డీఎఫ్‌కు మరోసారి ప్రజలు ఛాన్స్ ఇవ్వరని ఆ పార్టీలు అంటున్నాయి. కేరళ అసెంబ్లీలో 140 సీట్లు ఉండగా, ఈసారి యూడీఎఫ్ కూటమికి 100కుపైగా సీట్లు వస్తాయని యూడీఎఫ్ వర్గాలు విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాయి. అయితే యూడీఎఫ్‌కు కీలకమైన మైనారిటీ ఓట్లను చీల్చి, పరోక్షంగా బీజేపీ అభ్యర్థులకు సహాయపడేందుకే సీపీఎం కుట్ర చేస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇందుకోసమే కొన్ని అసెంబ్లీ స్థానాల్లో ఉద్దేశపూర్వకంగానే స్వతంత్ర అభ్యర్థులను సీపీఎం బరిలోకి దింపిందని వారు అంటున్నారు.

కాంగ్రెస్-ముస్లిం లీగ్-బీజేపీ కలిసి పనిచేస్తాయ్ : సీఎం విజయన్

యూడీఎఫ్ కూటమి, కాంగ్రెస్ ఆరోపణలను సీఎం పినరయి విజయన్ ఒక బహిరంగ సభ వేదికగా ఖండించారు. అవన్నీ నిరాధారమైన రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు అని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో తన సమావేశం పూర్తిగా పరిపాలనాపరమైందని తేల్చి చెప్పారు. కాంగ్రెస్-ముస్లిం లీగ్-బీజేపీ ఈ ఎన్నికల్లో కలిసి పనిచేసే అవకాశాలు ఉన్నాయని విజయన్ కౌంటర్ ఇచ్చారు. సీపీఎంను అడ్డుకునేందుకు ఆ మూడు పార్టీలు ఎంతకైనా తెగిస్తాయని మండిపడ్డారు. గతంలోనూ రహస్యంగా కాంగ్రెస్-ముస్లిం లీగ్-బీజేపీ కలిసి పనిచేశాయని ఆరోపించారు. కాంగ్రెస్, యూడీఎఫ్ కూటమి ఓటమి భయంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని సీపీఎం నేత, మాజీ ఆర్థిక మంత్రి టి.ఎం.థామస్ ఐజాక్ తెలిపారు. మళ్లీ ఎల్‌డీఎఫ్ కూటమి గెలుపు ఖాయమన్నారు.

నాడు బీఆర్ఎస్‌పై నేడు ఎల్‌డీఎఫ్‌పై బీ టీమ్ ముద్ర : బీజేపీ

మైనారిటీల ఓట్లను ఏకీకృతం చేయడానికి యూడీఎఫ్ కూటమి, ఎల్‌డీఎఫ్ కూటమి యత్నిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. ఆ రెండు కూటములు రాజకీయ ప్రేరేపిత ఉద్దేశంతో తప్పుడు ఆరోపణలను చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆ ఆరోపణల్లో అస్సలు వాస్తవాలు లేవన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్, సీపీఎం పార్టీల మధ్య పొత్తులు కుదిరిన విషయం అందరికీ తెలుసని రాజీవ్ చంద్రశేఖర్ చెప్పారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి బీ టీమ్‌గా కాంగ్రెస్ చిత్రీకరించిందన్నారు. ఇప్పుడు కేరళలోని ఎల్‌డీఎఫ్ కూటమిని కూడా అదే విధంగా కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా చేసుకుంటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అమలుచేసిన ఎన్నికల వ్యూహాన్నే కేరళలోనూ వర్తింపజేసే యత్నాల్లో హస్తం పార్టీ ఉందన్నారు.

సీపీఎం, బీజేపీ మధ్య అవగాహన కుదిరి ఉండొచ్చు, కానీ

"కేరళలోని కొన్ని అసెంబ్లీ స్థానాల్లో రాజకీయ పార్టీల మధ్య అవగాహనలు కుదిరినా కుదరొచ్చు. స్థానిక పరిస్థితులను బట్టి, అభ్యర్థులను బట్టి అందుకు అవకాశాలు ఉంటాయి. ఈక్రమంలోనే కొన్ని స్థానాల్లో సీపీఎం, బీజేపీ మధ్య అవగాహన కుదిరి ఉండొచ్చు. కానీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాల్లో క్షేత్రస్థాయిలో ఇదే ఫార్ములాను అమలు చేయడం ఇప్పటికిప్పుడు సాధ్యపడదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ కూటమిపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు యూడీఎఫ్, బీజేపీ సర్వశక్తులను ఒడ్డుతున్నాయి. దీంతో ఈ ఎన్నికల్లో హోరాహోరీ పోరు జరుగుతోంది" అని కాసరగోడ్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, ఎన్నికల విశ్లేషకుడు డాక్టర్ జి.గోపకుమార్ పేర్కొన్నారు.

# బుల్లెట్ ను పక్కన పెట్టి ఆఫీస్ కు గుర్రంపై వెళ్లిన బ్యాంకు ఉద్యోగి

మొదటి పేజి తరువాయి

సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆఫీసుకు ఆయన గుర్రంపైనే ప్రయాణించారు. అయితే, గోపాల్ గుర్రంపై రావడం గమనించిన ఆయన సహోద్యోగులు, అక్కడి స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆ దృశ్యాలను ఫొటోలు, వీడియోల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మరోవైపు, గోపాల్ గుర్రంపై ఆఫీస్ కు చేరుకోవడంపై సోషల్ మీడియాలో చాలా మంది నెటిజన్లు స్పందించారు.

### గుర్రంపై ఆఫీస్ రావడంపై గోపాల్ ఏమన్నారంటే

ఈ సందర్భంగా గోపాల్ఠాకూర్ మీడియాతో మాట్లాడారు. "నేను దేవాస్ లోని ఏయూ ఫైనాన్స్ బ్యాంక్ లో కలెక్షన్ విభాగంలో పనిచేస్తున్నాను. జవహర్ నగర్ బ్రాంచ్‌లో సమయానికి పంచ్ వేయాల్సి ఉంటుంది. బైక్‌లో పెట్రోల్ తక్కువగా ఉంది. బంకుల వద్ద భారీ రద్దీ ఉండడంతో ఆలస్యమవుతుందని భావించాను. దీంతో సమయంలోపు ఆఫీస్ కు చేరుకోవాలని నా గుర్రాన్ని తీసుకుని ఆఫీస్ కు బయలుదేరాను. అత్యవసర పరిస్థితుల్లో గుర్రం బైక్ కంటే త్వరగా నన్ను ఆఫీసుకు చేర్చింది. ఆఫీస్ కు గైర్హాజరు కాకుండా నన్ను కాపాడింది" అని గోపాల్ ఠాకూర్ పేర్కొన్నారు.

### ఇంధన కొరత అంటూ వదంతులు- బంకుల్లో భారీగా క్యూలు

ఇదిలా ఉండగా, పెట్రోల్, డీజిల్ కొరతపై వదంతులు మధ్యప్రదేశ్ లోని పలు నగరాల్లోకి వ్యాపించాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇండోర్ నుంచి దేవాస్ వరకు ఉన్న పెట్రోల్ పంపుల్లో జనం భారీగా క్యూ కడుతున్నారు. మరోవైపు, తమ వద్ద ఎలాంటి ఇంధన కొరత లేదని, తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. ఇండోర్, ఉజ్జయిని, బుర్హాన్‌పూర్ ప్రాంతాల్లోని బంకుల వద్ద జనం భారులు తీరిన పరిస్థితులు కనిపించాయి. సాగర్ జిల్లాలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. బీనా, ఖురై ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద రాత్రి వేళల జనం పోటెత్తారు. పెట్రోలు, డీజిల్ కోసం రాత్రివేళ వరకు బంకుల్లోనే వేచి ఉన్నారు. కొంతమంది వినియోగదారులు పెట్రోల్ , డీజిల్ నిల్వచేసుకోవడానికి ట్యాంకులు తీసుకుని బంకుల వద్దకు చేరారు. అంతేకాదు, పలు చోట్ల వాగ్వాదాలు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

# మార్కాపురం బస్సు ప్రమాద ఘటన - 14కు పెరిగిన మృతుల సంఖ్య

మొదటి పేజి తరువాయి

మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు. వీరు కనిగిరి, పామూరు వాసులుగా గుర్తించారు. 3 అగ్నిమాపక వాహనాలతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. మంటలు చెలరేగిన వెంటనే బస్సు నుంచి 10 మంది ప్రయాణికులు హుటాహుటిన దిగిపోయారు. ప్రమాదం అనంతరం ఘటనాస్థలిని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన కారణాలను ఎమ్మెల్యే అధికారులతో కలిసి ఆరా తీశారు. అదే విధంగా క్షతగాత్రులను తక్షణమే వైద్యసేవలకు తరలించేందుకు సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు.

ప్రమాదానికి బస్సు కండిషన్

సరిగా లేకపోవడమే కారణమని ప్రయాణికులంటున్నారు. ఇదే విషయాన్ని బస్సు డ్రైవర్ తో మాట్లాడినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. అంతేకాకుండా యర్రగొండపాలెం వద్ద గంటసేపు బస్సును నిలిపివేసి సిబ్బంది మరమ్మతులు చేశారన్నారు. ఇదిలావుంటే ప్రమాద సమయంలో బస్సు స్టీరింగ్ స్ట్రక్ అయిందని డ్రైవర్ చెబుతున్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. 13 మృతదేహాల వెలికితీత: బుధవారం సాయంత్రం 5.30 గంటలకు తెలంగాణలోని జగిత్యాల నుంచి పామూరుకు బస్సు బయల్దేరింది. ఈ క్రమంలో చీమకుర్తి నుంచి కంకర లోడ్‌తో మార్కాపురం వైపు టిప్పర్ వస్తుండగా ఉదయం 6 గంటల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రస్తుతం మృతదేహాలను బస్సు నుంచి ఒక్కొక్కటిగా పోలీసులు బయటకు తీస్తున్నారు. ఇప్పటివరకు 13 మృతదేహాలను బస్సు నుంచి బయటకు పోలీసులు తీశారు. 11 మంది మృతుల పేర్లు: మార్కాపురం బస్సు ప్రమాదంలో 13 మంది సజీవదహమవ్వగా మృతుల్లో పెదారికట్లకు చెందిన అంబటి అనిల్, అంబటి లియో, కనిగిరి మండలం చల్లగిరిగలకు చెందిన తమ్మిశెట్టి పిచ్చమ్మ, తమ్మిశెట్టి రుక్మిణి, కనిగిరి మండలం తింగారెడ్డిపల్లికి చెందిన ఉప్పు రమాదేవి, బత్తుల పద్మ, కనిగిరి మండలం తోకంచికి చెందిన ముత్తంగి వెంకటేశ్వర్లు, పొదిలి మండలం ఉన్నగురువాయపాలెం వాసులు నర్సింగ్ ప్రభావతి, నర్సింగ్ క్షేత్ర, కనిగిరి మండలం పనుగోడుకు చెందిన దేవాండ్ల రామయ్య, అదే విధంగా బుచ్చి మండలం మంగళకట్టకు చెందిన జయరామయ్యలుగా అధికారులు గుర్తించారు. ఒంగోలు జీజీహెచ్ కు తరలింపు: బస్సు ప్రమాద క్షతగాత్రులను ప్రస్తుతం మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తుండగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్ కు తీసుకొని వచ్చారు. ఒంగోలు జీజీహెచ్ కు 12 మందిని వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న క్షతగాత్రులను జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి పరామర్శించారు. రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ను క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణతో వైద్యం అందించి వీలైనంత త్వరగా కోలుకునే విధంగా చూడాలని డాక్టర్లకు కలెక్టర్ సూచించారు. మృతులకు రూ.5 లక్షల పరిహారం: మార్కాపురం జిల్లా రాయవరం బస్సు ప్రమాదంపై కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. మృతులకు కేబినెట్ లో మంత్రులంతా సంతాపం తెలిపి, బాధిత కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున, గాయపడినవారికి రూ.2 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అంతేకాకుండా బాధితులకు అందుతున్న వైద్యాన్ని పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు ఆదేశించారు. ప్రమాదాల నివారణ, ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్అండ్‌బీ, రవాణా శాఖ, పోలీసు, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి: మార్కాపురం జిల్లా, రాయవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిప్పర్-ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదస్థలం నుంచి సీఎంతో ఎస్పీ ఫోనులో మాట్లాడారు. ప్రమాద వివరాలను చంద్రబాబుకు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సవివరంగా తెలిపారు. ఆపై గాయపడిన వారికి అందుతున్న వైద్య సాయంపై ముఖ్యమంత్రి సమాచారం తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన మరో 20 మందిని తక్షణమే వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామని జిల్లా పోలీసు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న సమాచారంపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, మంత్రులతో సీఎం టెలికాన్ఫరెన్స్: మార్కాపురం బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు మంత్రులు అనిత, జనార్దన్ రెడ్డితోపాటు పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ, కలెక్టర్ తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రమాదం జరిగిన తీరుపై ప్రాథమిక సమాచారాన్ని జిల్లా ఎస్పీ, కలెక్టర్ సీఎంకి వివరించారు. ప్రమాద సమయంలో మొత్తం 35 మంది బస్సులో ఉన్నారని అధికారులు తెలిపారు. 13 మంది చనిపోయారని, 22 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వివరించారు.

# సంపాదకీయం

## ఉన్నత విద్యకు 'కొత్త' గ్రహణం

ఉన్నత విద్యా వ్యవహారాల నిర్వహణకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ) స్థానంలో ఒక కొత్త సంస్థను ఏర్పాటు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం పూనుకున్నది. ఆ సంకల్పంతోనే 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' (వీబీఎస్ఏ) బిల్లును ప్రతిపాదించింది. యూజీసీ మాజీ సభ్యుడుగా ఆ ఉన్నత విద్యా సంస్థ రద్దుకు నేను ఒక్క కన్నీటి బొట్టు కూడా కార్చను. ఎందుకని? యూజీసీ ఒక విఫల వ్యవస్థ. విద్యావేత్తలేకాదు, విధాన రూపకర్తలు సైతం ఈ విషయమై ఏకాభిప్రాయంతో ఉన్నారు. అయితే జాతీయ నూతన విద్యా విధానం (ఎన్‌పీఏ)2020 వాగ్దానం చేసినట్టుగా యూజీసీ స్థానంలో ఒక నూతన నియంత్రణ వ్యవస్థగా వీబీఎస్ఏ ఆవిర్భవిస్తే దానికి నేను సంతోషంగా మద్దతునిస్తాను. ఎన్‌పీఏ వాగ్దానం చేసిన సంస్థ ఎలా ఉంటుందో కూడా ఒకసారి గుర్తుచేస్తాను: 'వ్యవస్థలో నిరోధ సమతౌల్యాలను వ్యవస్థీకరించి, ప్రయోజనాల సంఘర్షణను సాధ్యమైనంతగా తక్కువ స్థాయిలో ఉంచుతూ అధికారాల కేంద్రీకరణను రూపుమాపే స్వతంత్ర, సాధికార సంస్థ ఒకటి ఉన్నతవిద్యా వ్యవస్థకు అత్యవసరం'. విచారకరమైన విషయమేమిటంటే ప్రస్తుతం పార్లమెంటు స్థాయీ సంఘం పరిశీలనలో ఉన్న ప్రతిపాదిత వీబీఎస్ఏ బిల్లు ఎన్‌పీఏ దార్శనికతకు విరుద్ధంగా ఉన్నది. కొత్త నియంత్రణ నిర్మాణం అధికారాల కేంద్రీకరణకు దోహదం చేసేదిగా ఉన్నది. ఇది ఉన్నత విద్య కేంద్రీకరణ, అధికార యంత్రాంగం పెరుగుదల, ఉన్నత విద్య వాణిజ్యీకరణకు దారి తీసేదిగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రస్తుత యూజీసీ వ్యవస్థకంటే రాబోయే వీబీఎస్ఏ వ్యవస్థ మరింత అధమమైనది. ఉన్నత విద్య సమున్నత లక్ష్యాల పరిపూర్తికి అది దోహదం చేయగలదని భావించడం ఒక భ్రమ మాత్రమే. 201013 సంవత్సరాల మధ్య యూజీసీ గౌరవ సభ్యుడిగా ఉన్న కాలంలో దేశ ఉన్నత విద్యా వ్యవహారాల నిర్వహణ ఎలా ఉంటుందో, అవి ఎలా నిర్దేశితమవుతాయో చాలా దగ్గరగా పరిశీలించే అవకాశం నాకు లభించింది. యూజీసీ ఒక అవినీతికర, అసమర్థ సంస్థ. ప్రయోజనాల సంఘర్షణ కూడా యూజీసీలో ముమ్మరంగా ఉన్నది. యూజీసీకి బాధ్యత వహించే విద్యావేత్తలు కేంద్ర ప్రభుత్వంలోని ఒక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ నుంచి ఫోన్ వస్తే చాలు, ఎంతో విధేయంగా లేచి నిలబడి మరీ మాట్లాడడం పరిపాటి. ఇది నమ్మవలసిన నిజం. యూజీసీ స్వయం ప్రతిపత్తి అనేది కాగితాలకే పరిమితమైన విషయం. యూజీసీలో మొట్టమొదటి అధికారిక ప్రయోజనాల సంఘర్షణకు మార్గదర్శకాలను ఆమోదింపజేయడం ఆ సంస్థ గౌరవ సభ్యుడిగా నేను సాధించిన ఏకైక విజయం. వాటి ప్రకారం, యూజీసీ కమిటీల సభ్యులు తమకు ఏవైనా సంభావ్య ప్రయోజన వైరుధ్యాలు ఉంటే వాటిని ప్రకటించాలి. తమకు భాగస్వామ్యం లేదా ప్రమేయమున్న సంస్థలకు సంబంధించిన నిర్ణయాల నుంచి వైదొలగాలి. అయితే నేను ప్రవేశపెట్టిన ఈ విధానమే నన్ను యూజీసీ నుంచి తొలగించేందుకు దారితీసింది! రాజకీయ క్రియాశీలత అన్న ఆరోపణపై నన్ను తొలగించారు. చెప్పవచ్చినదేమిటంటే యూజీసీ వ్యవస్థ ఉన్నతస్థాయి నుంచి సకల అధర్మాచరణలతో భ్రష్టుపట్టిపోయింది. దాన్ని పై నుంచి కింది దాకా సర్వసమగ్రంగా సంస్కరించవలసిన అవసరమున్నది. ఇది నా ఒక్కడి అభిప్రాయం మాత్రమే కాదు. 2009లో ప్రొఫెసర్ యశ్‌పాల్ నేతృత్వంలోని ఒక కమిటీ కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. 'భారతదేశంలో ఉన్నత విద్య పునరుద్ధరణ, పునరుజ్జీవనం' పేరిట ఉన్న ఆ నివేదికను ప్రస్తుత సందర్భంలో చదవడం సత్ఫలితాల నివ్వగలదు. ఉన్నత విద్య ఒక వ్యాపార సరుకుకాదని, అది ఒక ప్రజా ప్రయోజనమని ఆ నివేదిక పేర్కొంది. విశ్వవిద్యాలయం ప్రాథమిక ఉద్దేశం జ్ఞాన సృష్టి, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించడమని స్పష్టం చేసింది. ఉన్నత విద్యారంగం లాభాపేక్షతో నడిస్తే ఆ సమున్నత లక్ష్యాలను సాధించలేమని యశ్‌పాల్ కమిటీ అభిప్రాయపడింది. ఉన్నత విద్యారంగంలో ప్రమాణాలు నాణ్యమైనవిగా ఉండాలంటే ప్రభుత్వం నిధులు ఉదారంగా అందించాలని, విద్యా వ్యాపారీకరణ, విద్యా ప్రమాణాల పతనాన్ని అరికట్టేందుకు కఠినమైన నియంత్రణ ఉండాలని నివేదిక సిఫారసు చేసింది. ప్రస్తుత వీబీఎస్ఏ బిల్లు ప్రతిపాదనలు యశ్‌పాల్ కమిటీ సిఫారసులకు విరుద్ధంగా ఉన్నాయి. ఈ బిల్లు చట్టంగా అమలులోకి వస్తే మూడు ప్రతికూల పరిణామాలు ఏకకాలంలో సంభవిస్తాయి: ఉన్నత విద్యా సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోతాయి; బోధనా సిబ్బందికి విద్యా సంబంధ స్వేచ్ఛ కొరవడుతుంది; ఉన్నత విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం తగ్గిపోతుంది. ఇవి ఉన్నత విద్య ప్రజా ప్రయోజనాలను నెరవేరుస్తాయా? సామాజిక న్యాయానికి దోహదం చేస్తాయా? సమాధానాలు స్పష్టమే. ఉన్నత విద్యా వ్యవస్థకు సంబంధించి కొత్త శాసన నిర్మాణంగా ఉద్దేశించినప్పటికీ వీబీఎస్ఏ బిల్లు నిజానికి 2018లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్‌ఈసీఐ) కొత్త అవతారమే, సందేహం లేదు. హెచ్‌ఈసీఐ బిల్లు శాసనంగా రూపుదాల్చినప్పుడు అధికారాలు కేంద్రీకృతమై ఉన్నత విద్యావ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, నిధుల లభ్యతను కోల్పోతుందని విద్యావేత్తలు, విద్యార్థిలోకం, రాజకీయ పక్షాల నుంచి తీవ్ర భయాందోళనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఆ బిల్లును ఉపసంహరించుకోక తప్పలేదు. అధికారాల కేంద్రీకరణ సమస్య గురించి నేటి కొత్త బిల్లు పట్టించుకోలేదు. పైగా అదే లక్ష్యాన్ని అధికారాల కేంద్రీకరణ సాధించేందుకు మరింత సంక్లిష్ట సంస్థలను సృష్టించింది. సర్వాధికార హెచ్‌ఈసీఐకు బదులుగా మూడు వేర్వేరు సంస్థల రెగ్యులేటరీ కౌన్సిల్, అక్రిడిటేషన్ కౌన్సిల్, అకడమిక్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ను పర్యవేక్షించే వీబీఎస్ఏ అనే సర్వోన్నత సంస్థ ఉనికిలోకి రానున్నది.

# అధికార క్రీడలు... అనుకోని పరిణామాలు!



ఐరాస ఛార్టర్ ప్రకారం... ఏదైనా సైనిక దాడి లేదా దురాక్రమణ వంటి సమయాల్లోనే ఆత్మరక్షణ కోసం ఒక దేశం యుద్ధాన్ని ప్రకటించగలదు. లేదా భద్రతా మండలి అనుమతి ఇచ్చినప్పుడు మాత్రమే యుద్ధానికి దిగడం సాధ్యం. కానీ, ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం విషయంలో అటువంటి షరతులేవీ పాటించలేదు. ఈ నేపథ్యంలో ఈ యుద్ధం మీద భవిష్యత్తు చరిత్రకారులు ఎలాంటి తీర్పునిస్తారు? బలమైన దేశాల చర్యలు బలమైన ప్రభావం చూపుతాయి. చాలా సందర్భాల్లో అనుకోని పరిణామాలకు దారితీస్తాయి. గత ఎనిమిది దశాబ్దాల్లో అంతర్జాతీయ వ్యవహారాల్లో అమెరికా తలదూర్చని పరిణామాలు తక్కువ. కొన్ని సందర్భాల్లో అమెరికా జోక్యం సానుకూల ప్రభావాన్ని కనబరిచింది. ఉదాహరణకు, మార్షల్ ప్రణాళిక. రెండో ప్రపంచ యుద్ధంలో విధ్వంసానికి గురైన పశ్చిమ ఐరోపా పునర్నిర్మాణానికి ఈ ప్రణాళిక ఎంతో దోహదం చేసింది. దీని ద్వారా అక్కడి దేశాలకు అమెరికా భారీ ఆర్థిక సాయం అందించింది. కూటములను బలోపేతం చేసింది. వాణిజ్యాన్ని పెంపొందించింది. అనేక రకాలుగా ఐరోపా పునరుజ్జీవనానికి కారణమైన అమెరికా సాయం 'నాటో' కూటమికి దన్నుగా మారింది. జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ సైతం అమెరికా ఉదారత నుంచి లాభపడ్డాయి. కానీ కమ్యూనిజాన్ని ఎదుర్కొనే క్రమంలో అమెరికా చేసిన కొన్ని దుస్సాహసాలు చేదు అనుభవాలను మిగిల్చాయి. వియత్నాం, కంబోడియా, లావోస్‌లు భారీగా దెబ్బతిన్నాయి. అఫ్గానిస్థాన్‌లో జోక్యం(1980-88), అఫ్గాన్‌పై దండయాత్ర(2001), ఇరాక్ మీద యుద్ధం(2003) దారుణ పర్యవసానాలకు దారితీశాయి. ఆ దేశాల్లోని ప్రజలకు, మిగతా ప్రపంచానికి ఇప్పటికీ అవి పీడకలలే. తాలిబన్లు పెరగడానికీ, అల్‌ఖైదా, ఐసిస్‌ల ఆవిర్భావానికీ అమెరికా విధానాలు, జోక్యాలే ప్రత్యక్ష కారణాలు!

### ఫలితాలు వేదనాభరితమే...

ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరావానీ... ప్రస్తుత యుద్ధాన్ని వ్యతిరేకించేవారి వాదనలను నిక్కచ్చిగా వినిపించారు. సమితి ఛార్టర్, అంతర్జాతీయ చట్టాన్ని అమెరికా, ఇజ్రాయెల్ ఎలా ఉల్లంఘించాయో వివరించారు. ఒక రాయబారిగా, తన బాధ్యతల్లో భాగంగా ఆయన సరిగానే చెప్పారు. కానీ, ఇరాన్‌లోని మతశక్తుల ఆగడాలను, రెచ్చగొట్టే చర్యల్ని మాత్రం దాటేశారు! 1979లో ఇరాన్‌లో అధికారాన్ని చేజిక్కించుకున్న మతనేతల ప్రభుత్వం... ఇజ్రాయెల్ ఉనికే లేకుండా చేస్తామని అధికారికంగా ప్రకటించింది. రాజ్యవ్యవస్థలో భాగంకాని నాలుగు ఉగ్రవాద బృందాలను తయారుచేసింది. హెజ్బొల్లా (లెబనాన్), హమాస్(గాజా), హూతీలు(యెమెన్), ముస్లిం బ్రదర్ హుడ్(ఇరాక్, సిరియా)... ఇవి ఆయా దేశాల భద్రతకు తీవ్ర ముప్పుగా మారాయి. మరోవైపు, శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న సొంత పౌరుల మీదే ఇరాన్ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా హింసకు పాల్పడింది. అమెరికా-ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం ఇరాన్‌లోని ఏ సమస్యనైనా పరిష్కరించగలదా, లేక పరిస్థితిని ఇంకా సంక్లిష్టం చేస్తుందా? అనేది అసలైన ప్రశ్న. సమాధానాన్ని బహుశా రెండు భాగాలుగా చూడాలి. ఇజ్రాయెల్‌కు, పొరుగున ఉన్న అరబ్ దేశాలకు ఇరాన్ నుంచి పొంచివున్న ప్రమాదానికి సంబంధించింది మొదటి కోణం. ఇరాన్ క్షిపణుల మౌలిక వసతులను బలహీనపరచడం, యురేనియం వసతులను నాశనం చేయడం కొన్నేళ్లపాటు వారి సుస్థిరతకు భరోసా ఇవ్వొచ్చు. అలాగే, సాక్షాత్తూ ఒక రాజ్యవ్యవస్థే పెంచి పోషిస్తున్న ప్రచ్ఛన్న ఉగ్రవాద సంస్థలను గణనీయంగా దెబ్బతీయవచ్చు. ఇక సుదీర్ఘకాలంగా బాధితులుగా ఉన్న ఇరాన్ ప్రజలు ఈ యుద్ధం పర్యవసానంగా స్వేచ్ఛనూ, అభివృద్ధినీ చవిచూడగలరా అన్నది అత్యంత ముఖ్యమైన రెండో కోణం. ఇప్పటి పరిస్థితుల్లో అటువంటి అవకాశాలు అంతంతమాత్రంగానే ఉండటం విచారకరం. ఇరాన్‌లో మతపాలన బలంగా, లోతుగా వేళ్లూనుకుని ఉంది. క్రూరమైన ఆ పాలనను కూలదోయడానికి ఇరాన్ ప్రజలకు ఒక సంస్థాగత వేదిక లేదు. అంత సాధనాసంపత్తి కూడా లేదు. ఆధిపత్య దేశాల దండయాత్రలు తరచూ వినాశకరంగా ముగుస్తుంటాయి. ఈ నేపథ్యంలో పొరుగుదేశాల కోణంలో ప్రస్తుత యుద్ధం వల్ల ఇరాన్ పాలనా వ్యవస్థ బలహీనం కావొచ్చు. కానీ దేశీయంగా నియంత్రణ కోల్పోదు. లేదా అక్కడ అంతర్యుద్ధం, అరాచకత్వం, మూకుమ్మడి వలసలు ప్రబలవచ్చు. ఓ గొప్ప నాగరికతకు వారసులైన ఇరాన్ ప్రజలకు ఇదో వేదనాభరిత ఫలితమవుతుంది.

### 'ఆపరేషన్ ఎజాక్స్' గుణపాఠం...

గల్ఫ్ దేశాల్లో ఎట్టకేలకు మొదలైన ఆధునికీకరణ, లౌకికవాదాలు భారీగా దెబ్బతినడం, పెను విధ్వంసంతో పశ్చిమాసియాలో అనిశ్చితి ఏర్పడటం తప్ప ఈ యుద్ధం వల్ల ఉపయోగమేమీ లేదు. పైగా ప్రపంచ ఇంధన భద్రత సవాళ్లలో చిక్కుకుంది. ఈ ప్రాంతంలోని కోట్లాదిమంది పౌరుల, ప్రవాసుల రోజువారీ జీవితాల్లో అయోమయం నెలకొంది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఈ సమయంలో 'ఆపరేషన్ ఎజాక్స్' దుస్సాహసం నుంచి అమెరికా, ఇజ్రాయెల్ పాఠం నేర్చుకోవడం అవసరం. జాతీయవాది, ఎంతో ప్రజాదరణ కలిగిన ఇరాన్ ప్రధాని మొసాదెఘ్‌ను 1953లో అగ్రరాజ్యాలు పదవీచ్యుతుణ్ని చేశాయి. ఆంగ్లో-పర్షియన్ చమురు సంస్థ లాభాలు ఇరానియన్‌లకే దక్కాలని మొసాదెఘ్ దాన్ని జాతీయీకరించడం బ్రిటన్‌కు అప్పట్లో ఆగ్రహం తెప్పించింది. తిరుగుబాటు ద్వారా మొసాదెఘ్‌ను గద్దెదించే కుట్రపన్నింది. ఈ పన్నాగానికి అమెరికా మొదట సుముఖత వ్యక్తం చేయలేదు. కానీ ఐసెన్‌హోవర్ అధ్యక్షుడయ్యాక ఒత్తిడికి తలొగ్గి పచ్చజెండా ఊపారు. తమ పట్టును పెంచుకునేందుకు కాచుకున్న ఇరానియన్ మతవాదులకు ఇదో అవకాశంగా మారింది. మొసాదెఘ్‌ను దెబ్బతీయడంలో క్రియాశీల సహకారం అందించారు. ఇరాన్ షాకి ఇష్టంలేకపోయినా, సర్వాధికారి అయ్యేందుకు అవకాశం కల్పించడంతో చివరికి ఒప్పుకొన్నారు. అధికారాన్ని తన చేతుల్లో కేంద్రీకరించుకున్నారు. దీంతో దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడింది. ప్రజల్లో అశాంతి ఏర్పడటంతో రాచరికం స్థానాన్ని మతపెద్దలు భర్తీ చేశారు. మొసాదెఘ్‌ను తొలగించడంతో తాము అద్భుతంగా విజయవంతమయ్యామని బ్రిటన్, అమెరికా భావించాయి. కానీ చరిత్ర మరోలా రుజువు చేసింది. ఇక ఇప్పటి యుద్ధం గురించి చరిత్ర తీర్పు ఎలా ఉండబోతోంది?

# ధరల పెంపు - హరిత పరిష్కారం

యుద్ధాలు ఎప్పుడు వస్తాయో మనం ముందుగా కనుక్కోవడం కష్టమే, కానీ వాటి వల్ల కలిగే ఆర్థిక నష్టాల నుండి మనల్ని మనం కాపాడుకోగలం. హరిత ఇంధనాల వినియోగం అనేది కేవలం పర్యావరణ హితం మాత్రమే కాదు, అది మన దేశ భద్రతకు సామాన్యుడి జేబుకు శ్రీరామరక్ష. యుద్ధ మేఘాల చాటున భారత్ స్వయం సమృద్ధి దిశగా నడవాలంటే హరిత పరిష్కారమే మార్గం. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఇజ్రాయెల్ - ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఈ యుద్ధం ప్రభావం కేవలం ఆ దేశాలకే పరిమితం కాకుండా, గల్ఫ్ రీజియన్ నుండి ముడి చమురు దిగుమతులపై ఆధారపడే మన భారత్ వంటి దేశాలపై తీవ్రంగా పడుతోంది. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 110-120 డాలర్లు దాటిపోవడంతో, మన దేశంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి.




### హరిత ప్రత్యామ్నాయాలే దిక్కు

భవిష్యత్తులో మరే ఇతర ప్రపంచ యుద్ధాలు వచ్చినా మన ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం కాకుండా ఉండాలంటే, మనం విదేశీ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించి, ప్రకృతి సిద్ధమైన 'హరిత ప్రత్యామ్నాయాల' వైపు మళ్లడం అత్యవసరం. ముందుగా రవాణా రంగంలో 'ఎలక్ట్రిక్ విప్లవం' రావాలి. పెట్రోల్ ధర వంద దాటిన వేళ, ఎలక్ట్రిక్ వాహనం వాడటం వల్ల కిలోమీటరుకు కేవలం 15 నుండి 20 పైసలే ఖర్చవుతుంది. ప్రభుత్వం అందిస్తున్న ౖావీ జు-ణ=×ఎజు వంటి పథకాల ద్వారా ఎలక్ట్రిక్ టూ-వీలర్లపై దాదాపు ₹10,000 నుండి ₹30,000 వరకు రాయితీ లభిస్తోంది. ఇంధన కొరతను ఎదుర్కోవడానికి ఇది అత్యంత సులభమైన మార్గం.

### సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు బెస్ట్

కేవలం వాహనాలే కాదు, మన ఇళ్లలో కూడా మార్పు రావాలి. 'పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం' ద్వారా ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే, నెలవారీ కరెంటు బిల్లుల నుండి విముక్తి లభిస్తుంది. 3 కిలోవాట్ల వరకు సోలార్ సిస్టమ్ పెట్టితే ప్రభుత్వం సుమారు ₹78,000 వరకు సబ్సిడీ ఇస్తోంది. దీనివల్ల మన సొంత విద్యుత్తు మనమే తయారు చేసుకోవచ్చు, తద్వారా చమురుతో తయారయ్యే థర్మల్ పవర్ పై భారం తగ్గుతుంది.

### ఇథనాల్ బ్లెండింగ్

మరో అద్భుతమైన ప్రత్యామ్నాయం 'ఇథనాల్ బ్లెండింగ్'. మన రైతులు పండించే చెరకు వ్యర్థాల నుండి తీసే ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపడం వల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకునే ముడి చమురు అవసరం తగ్గుతుంది. ఇప్పటికే మన దేశం 15% నుండి 20% వరకు ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను విజయవంతంగా వాడుతోంది. ఇది రైతులకు ఆదాయాన్ని ఇవ్వడమే కాకుండా, పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గిస్తుంది.

### యుద్ధ నష్టాల నుంచి రక్షణ

భవిష్యత్తు ఇంధనంగా పిలవబడే 'గ్రీన్ హైడ్రోజన్' వైపు భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. యుద్ధాల వల్ల గ్యాస్ సరఫరా నిలిచిపోయినా, నీటి నుండి ఉత్పత్తి చేసే ఈ హైడ్రోజన్ మన పరిశ్రమలకు, భారీ ట్రక్కులకు ఇంధనంగా మారుతుంది. ఇది పొగను విడుదల చేయదు, కేవలం నీటి ఆవిరిని మాత్రమే బయటకు పంపిస్తుంది. ముగింపుగా, యుద్ధాలు ఎప్పుడు వస్తాయో మనం ముందుగా కనుక్కోవడం కష్టమే, కానీ వాటి వల్ల కలిగే ఆర్థిక నష్టాల నుండి మనల్ని మనం కాపాడుకోగలం. హరిత ఇంధనాల వినియోగం అనేది కేవలం పర్యావరణ హితం మాత్రమే కాదు, అది మన దేశ భద్రతకు సామాన్యుడి జేబుకు శ్రీరామరక్ష.

# తెలియని స్థితిలో ప్రభుత్వ బకాయిలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వంపై పెట్టుకున్న విశ్వాసం నేడు తీవ్రమైన పరీక్షకు గురవుతోంది. దశాబ్దాల పాటు ప్రజాసేవలో నిమగ్నమైన ఉద్యోగులు, పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన, భద్రమైన జీవితం గడపాల్సిన పెన్షనర్లు ఈ రెండు వర్గాలూ ప్రస్తుతం తెలియని స్థితిలో ఉన్న ప్రభుత్వ బకాయిలు కారణంగా తీవ్రమైన ఆర్థిక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ సేవలో పనిచేసిన కాలంలో నియమ నిబద్ధత, బాధ్యత, క్రమశిక్షణను పాటించిన ఉద్యోగులు, పదవీ విరమణ అనంతరం మాత్రం తమకు రావాల్సిన చట్టబద్ధ హక్కుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు; ప్రభుత్వ పాలనపై నమ్మకాన్ని దెబ్బతీసే అంశంగా మారింది.

### విశ్వాస బంధం బలహీనం

డియర్‌నెస్ అలవెన్స్, పీఆర్సీ బకాయిలు, ఇతర సేవా సంబంధిత చెల్లింపులు ఏ దశలో ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎంత మొత్తం బకాయి ఉంది ఏ నెల నుంచి పెండింగ్‌లో ఉంది ఎప్పుడు చెల్లిస్తారు అనే ప్రశ్నలకు ఎక్కడా స్పష్టమైన సమాధానాలు లేవు. ఈ అనిశ్చితి ఉద్యోగులు, పెన్షనర్ల జీవితాల్లో అస్థిరతను పెంచడమే కాకుండా, ప్రభుత్వం, ప్రజల మధ్య ఉన్న విశ్వాస బంధాన్ని కూడా బలహీనపరుస్తోంది. ఈ పరిస్థితి కొనసాగితే, భవిష్యత్ తరాల ఉద్యోగులలో ప్రభుత్వ సేవ పట్ల ఆసక్తి తగ్గే ప్రమాదం కూడా ఉంది.

### బకాయిని ఒకేసారి పూర్తిగా చెల్లించాలి

మొదటిగా, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన అన్ని రకాల బకాయిల వివరాలను వారి జీతపు స్లిప్పులు, పెన్షన్ స్లిప్పుల్లో తప్పనిసరిగా స్పష్టంగా చూపించాలి. ప్రస్తుతం నెలకు చెల్లిస్తున్న మొత్తమే చూపించి, పెండింగ్‌లో ఉన్న బకాయిలను గోప్యంగా ఉంచడం పారదర్శకతకు విరుద్ధం. బకాయిల మొత్తం, రకం, కాలపరిమితి స్పష్టంగా కనిపిస్తేనే లబ్ధిదారులు తమ ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోగలుగుతారు. రెండవది, ఒక్కో రకమైన బకాయిని ఒకేసారి పూర్తిగా చెల్లించాలి. చిన్న చిన్న విడతలుగా



బకాయిలను విడుదల చేయడం వల్ల వాటి వాస్తవ విలువ తగ్గిపోతూ, పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఉద్యోగులు, పెన్షనర్లకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతోంది. ఒకసారి ప్రభుత్వం చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నప్పుడు, ఆ బకాయిని ఒకే విడతలో, ఒకే స్ట్రెచ్‌లో పూర్తిగా క్లియర్ చేయడం ప్రభుత్వ నైతిక, పరిపాలనా బాధ్యత. విడతల విధానం అనవసర అసంతృప్తిని, అనిశ్చితిని మాత్రమే పెంచుతుంది.

### మరో అపరిష్కృత సమస్య

మూడవది, ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ బకాయిలను ముందుగా పూర్తిగా క్లియర్ చేయాలి. ఇది ఉద్యోగులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ మాత్రమే కాదు; పరిపాలనా క్రమశిక్షణకు కూడా అవసరం. పాత పీఆర్సీ బకాయిలు పరిష్కరించకుండా కొత్త పీఆర్సీపై చర్చించడం తార్కికంగా కూడా సమంజసం కాదు. ఇది అయోమయాన్ని, అపోహలను పెంచుతుంది. నాలుగవది, 11వ పీఆర్సీ బకాయిలు పూర్తిగా చెల్లించిన అనంతరం మాత్రమే 12వ పీఆర్సీని తుది రూపంలో ఖరారు చేయాలి. అప్పుడే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ఉద్యోగులు, పెన్షనర్లకు విశ్వాసం ఏర్పడుతుంది. లేదంటే ప్రతి కొత్త పీఆర్సీ కూడా మరో అపరిష్కృత సమస్యగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

### పెన్షనర్ల డైరెక్టరేట్ ఏర్పాటు

ఐదవది, ప్రతి ఉద్యోగి, ప్రతి పెన్షనర్ తమ బిల్ ఏ దశలో ఉందో తెలుసుకునేలా బిల్ స్టేటస్ ట్రాకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. బిల్ ఎక్కడ పెండింగ్‌లో ఉంది ఏ అధికారి వద్ద ఉంది ఎప్పుడు క్లియర్ అవుతుంది అనే వివరాలు ఆన్‌లైన్‌లో స్పష్టంగా తెలిసేలా చేయాలి. ఇది కార్యాలయాల చుట్టూ తిరగడం, అనవసర వినతులు, మధ్యవర్తిత్వం వంటి సమస్యలను పూర్తిగా తగ్గిస్తుంది. ఆరవది, పెన్షనర్ల సమస్యలన్నింటికీ ఒకే వేదికగా పరిష్కారం చూపేందుకు ప్రత్యేకంగా ఒక పెన్షనర్ల డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం పెన్షనర్ల అంశాలు అనేక శాఖల మధ్య చెల్లాచెదురుగా ఉండటంతో సమస్యల పరిష్కారం ఆలస్యం అవుతోంది. ప్రత్యేక డైరెక్టరేట్ ఉంటే బాధ్యత స్పష్టంగా నిర్ణయించవచ్చు.

### పెన్షనర్లకు కావలసిది దయకాదు

ఈ అన్ని అంశాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రిని వినయపూర్వకంగా కోరేది ఏమిటంటే, పై సూచనలను కేవలం గ్రీవెన్స్‌లుగా కాకుండా ప్రభుత్వ బాధ్యతగా పరిగణించి, ప్రాధాన్యతా క్రమంలో తక్షణమే అమలు చేయాలి. పెన్షనర్లు దయ కోరడం లేదు. వారు తమ సేవలకు ప్రతిఫలంగా రావాల్సిన చట్టబద్ధ హక్కులను మాత్రమే కోరుతున్నారు. ఆ హక్కులకు న్యాయం చేయడమే మంచి పాలనకు అసలైన కొలమానం.

# మందుబాబులకు షాకింగ్ న్యూస్..

# మద్యం ధరలు పెంపు..! ఎంతంటే..?

సమ్మర్‌లో చిల్ బీర్ తాగాలనుకునేవారికి షాక్ తగలనుంది. బీర్ల ధరలు ఒక్కసారిగా పెంచేందుకు



కంపెనీలు రెడీ అవుతున్నాయి. యుద్ధ పరిస్థితులు క్రమంలో ప్యాకేజింగ్, సీసాల ధరలు పెరిగాయి. దీంతో కంపెనీలపై అదనపు భారం పడుతోంది. ఈ క్రమంలో ధరల పెంపు ఉండనుంది. మందుబాబులకు బిగ్ షాక్. బీర్ల ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఖర్చులు పెరుగుతున్న క్రమంలో ధరలను పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. బీర్ల ఉత్పత్తికి ఖర్చు పెరిగిందని, దీని ధరలను పెంచక తప్పదని బ్రూవర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. ఉత్పత్తి ట్యాక్సులు, ఇతర ఖర్చులు పెరగడంతో బీర్ల తయారీ కంపెనీలు సతమతమవుతున్నాయి. పన్నుల కారణంగా ఉత్పత్తి ఖర్చులు 12 నుంచి 15 శాతం వరకు పెరిగాయని, కంపెనీలపై అదనపు భారం పడుతుందని స్పష్టం చేసింది. ఇక బీరు సీసాల ధరలు కూడా భారీగా పెరిగాయి.

### పెరిగిన ఉత్పత్తి ఖర్చు

బీర్ సీసాల ధరలు 20 శాతం పెరిగాయి. ఇక ఇతర మెటిరీయల్ ఖర్చులు కూడా 20 నుంచి 25 శాతం పెరిగాయి. అంతేకాకుండా రవాణా ఖర్చులు కూడా 10 శాతం మేర పెరిగాయి. దీంతో బీర్ల తయారీకి అయ్యే ఖర్చులు పెరగడంతో వినియోగదారులపై ఈ భారాన్ని మోపేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. నష్టంతో కంపెనీలు అమ్మకాలు జరపాల్సిన అవసరం ఉందని, దీని వల్ల రానున్న రోజుల్లో బీర్ల ధరలు పెంచక తప్పదని బ్రూవర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. ఇప్పటికే బీర్ల ధరలు గణనీయంగా పెరిగాయి. మళ్లీ ఇప్పుడు పెంచితే మందుబాబులకు షాక్ అని చెప్పవచ్చు. దేశంలో ఏబీ ఇన్‌బెవ్, కార్ల్‌బర్గ్ కంపెనీలు 85 శాతం బీర్ అమ్మకాలను చేపడుతున్నాయి.

### పెరిగిన ప్యాకేజింగ్ ఖర్చులు

ఖర్చులు పెరుగుతుండటంతో బీర్ల ధరలను పెంచాలని కంపెనీలు భావిస్తున్నాయి. త్వరలోనే ధరల పెంపు ఉండొచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడంతో కంపెనీలకు మార్జిన్ ఖర్చులు తగ్గుతున్నాయి. దీంతో తక్షణమే ధరలను పెంచేందుకు కంపెనీలు రెడీ అవుతున్నాయి. గత కొద్ది నెలల్లోనే బీర్ల ఉత్పత్తికి ఖర్చు 15 శాతం పెరిగింది. బీర్ల బాటిల్ గాజు ధర 20 శాతం పెరిగింది. ఇక ప్యాకేజింగ్‌కు కాగితం ధర 100 శాతం పెరిగింది. ఇక పీఈ, ఎల్‌డీపీఈ ప్లాస్టిక్ ధరలు 25 శాతం వరకు పెరిగాయి. ఈ క్రమంలో ప్రతీ బీర్ కేస్‌పై రూ.20 మేర ధరను పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. కాగా మద్యం ధరలను పెంచే అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంది. ఇది రాష్ట్రాల చేతుల్లో ఉంటుంది. దీంతో కంపెనీలు రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది.

# మధ్యతరగతి వారికి గుడ్‌న్యూస్..

# కొత్త స్కీమ్‌కు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్!



కేంద్ర ప్రభుత్వం మాడిఫైడ్ ఉడాన్ పథకానికి రూ.28,840 కోట్ల బడ్జెట్‌తో ఆమోదం తెలిపింది. పదేళ్లలో దేశవ్యాప్తంగా 100 కొత్త విమానాశ్రయాలు, హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్‌ల నిర్మాణంతో సామాన్యులకు విమాన ప్రయాణం అందుబాటులోకి తేవడం లక్ష్యం. ఇది పర్యాటక రంగానికి ఊతమిచ్చి, వేల ఉద్యోగాలను సృష్టించి, ప్రాంతీయ అనుసంధానతను, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. దేశవ్యాప్తంగా విమాన ప్రయాణాన్ని సామాన్యులకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ మాడిఫైడ్ ఉడాన్ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకానికి రూ.28,840 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించగా, రాబోయే పదేళ్లలో దేశవ్యాప్తంగా 100 కొత్త విమానాశ్రయాలను నిర్మించడమే లక్ష్యంగా నిర్ణయించారు. ఈ పథకం కేవలం ఎయిర్‌పోర్టుల నిర్మాణంతో మాత్రమే పరిమితం కాకుండా, హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్‌ల అభివృద్ధిని కూడా కలిగి ఉంది. ఇప్పటివరకు విమాన సౌకర్యం లేని మారుమూల ప్రాంతాలు, చిన్న పట్టణాలను జాతీయ విమాన రవాణా నెట్‌వర్క్‌లోకి తీసుకురావడమే ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రాంతీయ అనుసంధానతను పెంచడం ద్వారా ప్రజలకు తక్కువ ఖర్చుతో విమాన ప్రయాణం అందించడమే కాకుండా, మధ్యతరగతి ప్రజల కలలను సాకారం చేయాలనే లక్ష్యాన్ని కేంద్రం ముందుంచింది. మాడిఫైడ్ ఉడాన్ పథకం అమలు వల్ల పర్యాటక రంగానికి కొత్త ఊపు లభించనుంది. ముఖ్యంగా పర్యాటక ప్రాధాన్యత గల ప్రాంతాలకు సులభంగా చేరుకునే అవకాశం పెరగడంతో దేశీయ పర్యాటకంలో వృద్ధి చోటు చేసుకుంటుందని భావిస్తున్నారు. అంతేకాకుండా, చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపార అవకాశాలు పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడతాయని అంచనా. విమానాశ్రయాల నిర్మాణం, నిర్వహణ, సంబంధిత సేవల రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా విమాన సౌకర్యం కల్పించడమే మా ప్రాధాన్యత అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఈ 100 కొత్త విమానాశ్రయాలు ఎక్కడ నిర్మించబడతాయన్న వివరాలు ఇంకా వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్

# ఆధార్ కార్డు ఉంటే ప్రతీ నెలా మీ అకౌంట్లోకి రూ.3 వేలు..

# కేంద్ర ప్రభుత్వం అద్భుత అవకాశం..



కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతీ నెలా రూ.3 వేల పెన్షన్ పొందాలనుకుంటున్నారా.. అయితే మీకు ఆ అవకాశం అందుబాటులో ఉంది. కేవలం నెలకు రూ.55 ప్రీమియం చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత నెల నెలా రూ.3 వేల పెన్షన్ పొందవచ్చు. ఇవి నేరుగా బ్యాంక్ అకౌంట్లో జమ అవుతాయి. కేంద్ర ప్రభుత్వం వివిధ వర్గాల కోసం అనేక పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, గృహ సహాయకుల కోసం ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్ ధన్ పథకాన్ని మోదీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చింది. వీరికి నెలకు రూ.3 వేల పెన్షన్ అందిస్తోంది. రిటైర్మెంట్ తర్వాత ప్రతీ నెలా ఈ పెన్షన్ అందుతుంది. ఈ పథకంలో చేరాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలి.. అంతేకాకుండా కొంతమొత్తంలో ప్రీమియం చెల్లించాలి.. ఈ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.

**అర్హతలు ఇవే..**

18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి

నెలవారీ ఆదాయం రూ.15 వేల కంటే తక్కువగా ఉండాలి

ఈపీఎఫ్, ఎన్‌పీఎస్ వంటి సౌకర్యాలు ఉండకూడదు

### ప్రీమియం ఎంత..?

వయస్సు, మీరు రిటైర్మెంట్ తర్వాత ఎంతవరకు పెన్షన్ పొందాలని అనుకుంటున్నారు అనే దానిని బట్టి ప్రీమియం ఉంటుంది. కానీ ప్రీమియం చాలా తక్కువగా ఉంటుంది. మీరు 18 ఏళ్ల వయస్సులో చేరితే నెలకు రూ.55 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. ప్రభుత్వం కూడా అందుకు సమానంగా రూ.55 చెల్లిస్తుంది. వయస్సు పెరిగే కొద్ది ఇందులో చేరితే ప్రీమియం ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక 60 ఏళ్లు వచ్చేంతవరకు అదే ప్రీమియం చెలించాల్సి ఉంటుంది. 60 ఏళ్ల దాటాక మీకు ప్రతీ నెలా రూ.3 వేల పెన్షన్ అందిస్తారు. ఒకవేళ పెన్షన్‌దారుడు మరణిస్తే.. జీవిత భాగస్వామికి 50 శాతం పెన్షన్ అందుతుంది. అంటే ప్రతీ నెలా రూ.1500 ఇస్తారు.

### దరఖాస్తు చేసుకోవడం ఎలా..?

ఈ పథకంలో చేరడం చాలా సులువు. ఆన్ లైన్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా సమీపంలోని కామన్ సర్వీసెస్ సెంటర్‌కు వెళ్లి అప్లై చేసుకోవచ్చు. కేవలం ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ సమర్పిస్తే సరిపోతుంది. ఇక మీరే స్వయంగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే కేంద్ర ప్రభుత్వ మాన్ ధన్ పోర్టల్‌లోకి వెళ్లి అప్లై చేసుకోవచ్చు. ఇప్పటివరకు దాదాపు 52.5 లక్షల మంది ఈ స్కీమ్‌లో చేరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌న్న కాకుండా కుటుంబానికి ఆర్థిక భరోసా కూడా దీని ద్వారా కల్పించవచ్చు.

# హోటల్స్, రెస్టారెంట్లకు వెళుతున్నారా..?

# కేంద్రం నుంచి భారీ ఊరట.. డబ్బులు ఆదా అయినట్లే..



కేంద్రం కీలక ప్రకటన చేసింది. గ్యాస్ కొరత క్రమంలో హోటళ్లు, రెస్టారెంట్లు మెనూలో ధరలను పెంచేశాయి. అంతేకాకుండా గ్యాస్ బిల్లు పేరుతో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. అదనపు ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత నేపథ్యంలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర ఆహార పదార్థాల షాపులు రేట్లను పెంచుతున్నాయి. ఆహార పదార్థాల ధరలు ఒకేసారి భారీగా పెంచాయి. గ్యాస్ ధరలు పెరగడం, సిలిండర్ల కొరత వేళ ధరలను భారీగా పెంచాయి. ఇక గ్యాస్ బిల్లు పేరుతో అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్న బిల్లు ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గ్యాస్ కొరతను బూచిగా చూపించి అదనపు ఛార్జీలను నిర్వహకులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. కస్టమర్ల నుంచి అదనపు ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎల్పీజీ ఛార్జీలు, ఇంధన వ్యయం పేరుతో అదనపు రుసుంలు వసూలు చేయవద్దని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ స్పష్టం చేసింది.

### మెనూలోని ధరలే ఫైనల్

హోటళ్ల నిర్వాహకులు అదనపు ఛార్జీలు వసూలు చేస్తుండటంపై జాతీయ వినియోగదారుల హెల్ప్ లైన్ నెంబర్‌కు కాల్స్ వస్తున్నాయి. అంతేకాకుండా సోషల్ మీడియాలో కూడా ఫొటోలు వైరల్ అవుతున్నాయి. దీంతో కేంద్రం స్పందించింది. మెనూలో పేర్కొన్న ధరల కంటే అదనపుంగా వసూలు చేయవద్దని, వినియోగదారులను ఇబ్బంది పెట్టవద్దని సూచించింది. వినియోగదారుల చట్టం రూల్స్‌ను పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపింది.

### 50 శాతం పెరిగిన వాణిజ్య సిలిండర్ సరఫరా

వాణిజ్య సిలిండర్ల సరఫరా 50 శాతం పెరిగినట్లు కేంద్రం బుధవారం ప్రకటించింది. వాణిజ్య సిలిండర్లను సరఫరా పెరిగిందని, గ్యాస్ కొరత లేదని చెబుతోంది. త్వరలో పూర్తి స్థాయిలో వాణిజ్య సిలిండర్ల సరఫరా యథాతథంగా జరుగుతుందని స్పష్టం చేసింది. ప్రజలు భయాందోళనకు గురి కావొద్దని సూచించింది. హార్ముజ్ జలసంధి భారత్‌కు ఇరాన్ తెరిసింది. భారత నౌకలను అనుమతిస్తోంది.

# ఒకే బ్యాంకులో రెండు లేదా మూడు అకౌంట్లను ఓపెన్ చేయవచ్చా..?

# బ్యాంకింగ్ రూల్స్ ఏం చెబుతున్నాయి..?




ఆర్థిక కార్యకలాపాల కోసం ఎక్కువమంది రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్యాంక్ అకౌంట్లను వినియోగిస్తూ ఉంటారు. ఇక ఒకే బ్యాంకులో కూడా ఒకటి కంటే ఎక్కువ అకౌంట్లను కలిగి ఉంటారు. ఇలా ఒకే బ్యాంకులో ఎక్కువ అకౌంట్లను తెరవొచ్చా.. బ్యాంకింగ్ రూల్స్ ఏం చెబుతున్నాయి..? ప్రభుత్వ పథకాల సొమ్మును నేరుగా పొందేందుకు, ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునేందుకు, డబ్బులు పొదుపు చేసుకునేందుకు ప్రతీఒక్కరికీ బ్యాంక్ అకౌంట్ అనేది తప్పనిసరి. ఇప్పటికాలంలో ప్రతీఒక్కరూ తప్పనిసరిగా ఏదైనా ఒక బ్యాంక్ అకౌంట్ కలిగి ఉంటున్నారు. ఇక ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ అకౌంట్లను మెయింటైన్ చేసేవారు కూడా చాలామందే ఉన్నారు. ఆర్థిక అవసరాల కోసం ఎక్కువశాతం మంది రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలను కూడా వాడుతున్నారు. వేర్వేరు బ్యాంకుల్లో అకౌంట్లను కలిగి ఉంటుండగా.. ఒకే బ్యాంకులో ఒకటి కంటే ఎక్కువ అకౌంట్లను ఓపెన్ చేయవచ్చా? అనే అనుమానం చాలామందికి ఉంటుంది. దానికి సమాధానం ఇందులో చూద్దాం.

### ఒకే బ్యాంకులో రెండు అకౌంట్లు ఉండవచ్చా..?

ఒకే బ్యాంకులో ఒకటి కంటే ఎక్కువ అకౌంట్లను ఓపెన్ చేసే అవకాశం ఉంది. ఒకటి సేవింగ్స్ అకౌంట్, మరొకటి జాయింట్ అకౌంట్.. ఫిక్స్‌డ్ డిపాజిట్ అకౌంట్.. ఇలా ఒకే బ్యాంకులో మల్టీపుల్ అకౌంట్లు తెరవొచ్చు. ఇందుకు బ్యాంకింగ్ రూల్స్ అనుమతిస్తున్నాయి. అయితే బ్యాంకుల వ్యక్తిగత నిబంధనలను బట్టి ఇవి మారుతూ ఉంటాయి.

### బ్యాంక్ అకౌంట్లపై లిమిట్ ఉందా..?

ఇక ఎన్ని బ్యాంక్ అకౌంట్లను ఒక వ్యక్తి కలిగి ఉండాలనే దానిపై నిబంధనలు ఏం లేవు. ఎన్ని ఖాతాలను అయినా కలిగి ఉండవచ్చు. అయితే ఎక్కువ బ్యాంక్ అకౌంట్లను కలిగి ఉండటం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఎందుకంటే ప్రతీ బ్యాంక్ అకౌంట్లలో మినిమం బ్యాలెన్స్‌ను ఎల్లప్పుడూ ఉంచాల్సి ఉంటుంది. ఒకవేళ మెయింటైన్ చేయకపోతే బ్యాంకులు జరిమానా విధిస్తూ ఉంటాయి. అంతేకుండా ఎక్కువ బ్యాంకు అకౌంట్లు ఉంటే వాటిని ట్రాక్ చేయడం కూడా కష్టంగా ఉంటుంది. దీంతో రెండు లేదా మూడు అకౌంట్లు కలిగి ఉంటే మంచిదని, అంతకంటే ఎక్కువ అవసరం లేదని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ బ్యాంక్ అకౌంట్లు ఉంటే డెబిట్ కార్డ్ ఛార్జీలు, ఎస్ఎంఎస్‌లు పొందేందుకు వార్షిక సర్వీస్ ఛార్జీలు వంటివి చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మీకు ఆర్థికంగా నష్టమే జరుగుతుంది.

### ఇలా చేస్తే ప్రయోజనం

అత్యవసర అవసరాల కోసం సేవింగ్స్ అకౌంట్ ఒకటి ఉండాలి. ఇక దీర్ఘకాలంలో డబ్బులు పొదుపు చేసుకునేందుకు మరో అకౌంట్ ఉండాలి. ఇక ఏమైనా ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తుంటే దాని కోస ప్రత్యేక అకౌంట్ తెరవాలి. ఇలా చేయడం వల్ల ఎందుకు ఎన్ని డబ్బులు ఖర్చు పెడుతున్నామనే విషయాలు సులువుగా తెలుస్తాయి. దీని వల్ల మన ఆర్థిక విషయాలను ప్లాన్ చేసుకోవచ్చు.

# పెట్రోల్ బంక్‌లు బంద్.. కేంద్ర ప్రభుత్వం నుంచి రియాక్షన్.. కీలక ప్రకటన జారీ..







దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత అంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. దేశంలో ఇంధన కొరత లేదని స్పష్టం చేసింది. దేశంలో సరిపడ నిల్వలు ఉన్నాయని, ప్రజలు భయపడవద్దని సూచించింది. భయంతో అవసరం లేకపోయినా పెట్రోల్ బ్యాంక్‌ల వద్ద క్యూలు కట్టవద్దని సూచించింది.దేశంలో పెట్రోల్ బంక్‌ల వద్ద క్యూలైన్లు, నో స్టాక్ బోర్డులు ప్రదర్శిస్తున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇంధన నిల్వలు, గ్యాస్ సరఫరాలపై పెట్రోలియం శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. దేశంలో తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపింది. 26 కోట్ల టన్నుల చమురు అందుబాటులో ఉందని, పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేసింది. అటు ఎల్పీజీ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేవని, వాణిజ్య గ్యాస్ కేటాయింపు 50 శాతం పెంచినట్లు వెల్లడించింది. గ్యాస్ ఆన్‌లైన్ బుకింగ్స్ 92 శాతానికిపైగా జరుగుతున్నాయని, దుష్ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని పెట్రోలియం శాఖ సూచించింది.

### దేశంలో కొరత లేదు

దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడనుందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. పెట్రోల్ బంక్‌ల వద్దకు క్యూ కడుతున్నారు. ముందుగానే ఫుల్ ట్యాంక్ చేయించుకుంటున్నారు. అలగే డబ్బాలు, బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా పలుచోట్ల పెట్రోల్ బంక్‌ల వద్ద వాహనదారులు క్యూ కడుతుండటంతో స్టాక్ అయిపోతుంది. దీంతో నో స్టాక్ బోర్డులతో పెట్రోల్ బంక్‌లు మూతపడ్డ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో త్వరలో పెట్రోల్ కొరత ఏర్పడనుందనే ప్యానిక్ ప్రజల్లో నెలకొంది. సరిపడ నిల్వలు ఉన్నాయని, అలాంటి కొరత ఏం లేదని కేంద్రం క్లారిటీ ఇస్తున్నా.. ప్రజల్లో మాత్రం ఆందోళన నెలకొంది.

### త్వరలో ధరలు పెరుగుతాయా..?

గ్యాస్ తరహాలోనే త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పవర్ పెట్రోల్ ధర లీటర్‌పై రూ.2 పెరగ్గా.. ఇటీవల వాణిజ్య డీజిల్ ధరలను కూడా పెంచారు. త్వరలో సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరుగుతాయనే వార్తలు వస్తున్నాయి. దీంతో పాటు కొరత ఏర్పడుందనే వార్తలతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ముందుగానే పెట్రోల్ బంక్‌ల వద్దకు వెళ్లి ఫుల్ ట్యాంక్ చేయించుకుంటున్నారు.

# దురంధర్ ప్రచారంపై చర్యలు తప్పవు



దర్శకుడు ఆదిత్య ధర్ తన తాజా చిత్రం 'ధురంధర్: ది రివెంజ్' పై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై స్పందించారు. నెట్టింట వైరల్ అవుతున్న ఒక మార్ఫింగ్ ఫోటోపై ఆయన స్పష్టతనిచ్చారు. అది సినిమాకు సంబంధించినది కాదంటూ పోస్ట్ పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా 'ధురంధర్2' చిత్రానికి లభిస్తోన్న ఆదరణ చూసి నా హృదయం ఆనందంతో ఉప్పొంగుతోంది. అయితే, కొంతమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి మా అధికారిక ప్రోమోలను మారుస్తూ తప్పుడు కథనాలను సృష్టిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ముఖ్యంగా, ఈ చిత్రంలోని హంజా (జస్కీరత్) పాత్ర తలపాగా ధరించి సిగరెట్ తాగుతున్నట్లు ఉన్న ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది పూర్తిగా అబద్ధం. మా సినిమాలో కానీ, మేము విడుదల చేసిన ఏ ఇతర అధికారిక వీడియోల్లో కానీ అలాంటి సీన్ లేదు. ఇది కేవలం ఉద్దేశపూర్వకంగా అలజడులు సృష్టించాలని కొందరు చేస్తోన్న పని. సిక్కులు అంటే నాకెంతో గౌరవం. ఈ చిత్రంలో ప్రతి పాత్రను ఎంతో బాధ్యతతో వారిపై గౌరవంతోనే చిత్రీకరించాం. ఏఐతో సృష్టించిన ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరుతున్నాను. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటాను అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కిన 'ధురంధర్ 2' మార్చి 19న విడుదలైంది.

# ఉస్తాద్‌లో పవన్ కళ్యాణ్ ఎంట్రీ అదుర్స్

ప్రేక్షకుల స్పందనపై హరీష్ కామెంట్స్

పవన్ కళ్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'సినిమాలో పవన్ ఎంట్రీ సీన్‌పై సోషల్ మీడియాలో వచ్చిన ట్రోల్స్‌పై హరీశ్ శంకర్ స్పందించారు. ఆయన జీప్‌లో నుంచి రెండుసార్లు దిగడం ఒకే సీన్‌లో చూపించారని కొందరు విమర్శించారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ తనకు రెండు ఎంట్రీలు నచ్చాయని అందుకే పెట్టినట్లు తెలిపారు. కొన్నికొన్ని సన్నివేశాల్లో స్వేచ్ఛ తీసుకుంటా. ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ (ఖజీలిజీని ఐజీ÷ూజీని) ఫస్ట్ జీప్‌లో నుంచి దిగుతారు. ఆ సమయంలో ఒక బాడీ పడుతుంటే ఆయన దిగడం చూపించా. ఆ తర్వాత మళ్లీ జీప్ నుంచి జంప్ చేస్తూ కిందకు వస్తారు. ఇదేంటి రెండుసార్లు ఎలా దిగారని కొందరు అన్నారు. అలాంటివి పట్టించుకోను. నాకు రెండు షాట్లూ నచ్చాయి. నేను ఒక షాట్ తీశా. మాస్టర్ ఇంకోటి తీశారు. రెండూ బాగున్నాయి అనిపించింది. నచ్చాయి అంటే లాజిక్‌లను పట్టించుకోను. 'ధురంధర్ 2' కలెక్షన్స్ చూసి నాకు కూడా ఆనందంగానే ఉంది. మీరు గమనిస్తే.. నేను ఉస్తాద్‌లో చూపించిన దేశభక్తిని ఆదిత్యధర్ పూర్తిస్థాయిలో 'ధురంధర్ 2'లో చూపించారు. నా భావాలతో నాకు నచ్చిన సినిమా.. నా చిత్రం కంటే బాగా హిట్ అవుతోంది అన్నప్పుడు ఒకరకమైన ఆనందం ఉంటుంది కదా.. నేను ఇప్పుడు అదే సంతోషంలో ఉన్నాను. మనమందరం సినిమా లవర్స్. ఏ సినిమా విజయం సాధించినా ఆనందమే. ఇన్నేళ్ల నా కెరీర్‌లో చాలా తక్కువ సినిమాలు చేశాను. నేను తొమ్మిది సినిమాలు చేస్తే.. దాదాపు 10 చిత్రాలు క్యాన్సిల్ చేశా. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. స్క్రిప్ట్ కుదరకపోవడం, హీరో చివరి నిమిషంలో క్యాన్సిల్ చేయడం.. ఇలా ఎన్నో ప్రాజెక్ట్‌లు చేయలేకపోయా. ఎన్టీఆర్‌తో 'ఎంఎల్ఏ' చేద్దాం అనుకున్నా. కానీ, కుదర్లేదు. క్యాన్సిల్ అయిన ప్రాజెక్ట్‌లకు వర్క్ చేసి కూడా పట్టాలెక్కించలేకపోయా. ఇకనుంచి అలా జరగదు. చాలా కథలు రాసుకున్నా. వరుసగా తెరకెక్కిస్తాను.

------------




# వివక్ అగ్నిహోత్రి మూవీ... ఆపరేషన్ సిందూర్



'ది కాశ్మీర్ ÷ల్స్', 'ది వ్యాక్సిన్ వార్' వంటి వివాదస్పాద చిత్రాలతో సంచలనం సృష్టించిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించాడు. 'ఆపరేషన్ సిందూర్' అనే టైటిల్‌తో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం కోసం ఆయన ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్‌తో (టీ-సిరీస్) చేతులు కలిపినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ 'టైనీ' ధిల్లాన్ రాసిన పుస్తకం ఆధారంగా తెరకెక్కుతోంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు, భారత సాయుధ దళాలలోని వివిధ విభాగాలు సమన్వయంతో సాగించిన లోతైన పరిశోధనల ఆధారంగా ఈ కథను రూపొందించారు. కేవలం శబ్దం చేయడం కోసం కాకుండా, వాస్తవాలను క్లారిటీతో,

సినిమా మాయాజాలంతో ప్రపంచానికి చాటి చెప్పడమే తమ లక్ష్యమని వివేక్ అగ్నిహోత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. పల్లవి జోషి, వివేక్ అగ్నిహోత్రి తమ 'ఐ యామ్ బుద్ధ' ప్రొడక్షన్స్‌పై టీ-సిరీస్‌తో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు

# రణ్‌వీర్ తదుపరి చిత్రంపై ఆసక్తి



'ధురంధర్ 2' బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. 7 రోజుల్లోనే రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ స్పై థ్రిల్లర్.. టూ థౌజండ్ క్రోర్ దిశగా దూసుకెళుతోంది. ఈ మూవీ గ్రాండ్ సక్సెస్ తర్వాత రణవీర్ సింగ్ తదుపరి ఏ మూవీ చేయబోతున్నాడన్న ఆసక్తి అందరిలో నెలకొంది. అయితే ధురంధర్ ఊహించని హిట్

తర్వాత పర్హాన్ అక్తర్‌కు హ్యాండిచ్చాడు గల్లీబాయ్. 'డాన్ 3' ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. అంతకు ముందు సౌత్ దర్శకులు ప్రశాంత్ వర్మ, బాసిల్ జోసెఫ్‌తో కొంత కాలం ట్రావెల్ చేసి.. వాళ్ల టైం, ఎనర్జీని వేస్ట్ చేయించి తర్వాత గుడ్ బై చెప్పిన ఎక్స్‌పీరియన్స్ ఈ హీరోది. బోయపాటి శీను, ఎస్ శంకర్ కూడా రణవీర్ సింగ్‌ను సెట్ చేసేందుకు ట్రై చేస్తున్నారట. కానీ రణవీర్ మాత్రం ఓ బాలీవుడ్ దర్శకుడికి కమిటయ్యాడని తెలుస్తోంది.

రణవీర్ నెక్ట్స్ జాంబిస్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. స్కామ్ 1992 అసిస్టెంట్ డైరెక్టర్, లూటేరే సిరీస్ తెరకెక్కించిన జై మెహతా ఈ సినిమాను దర్శకత్వం వహించబోతున్నట్లు తెలుస్తోంది. ప్రళయ్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు సమాచారం. లోకతో పాపులారిటీ సంపాదించుకున్న కళ్యాణి ప్రియదర్శన్.. రణవీర్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతోందట. జులై లేదా ఆగస్టు నుంచి ఈ మూవీ సెట్స్ పైకి వెళ్లనుందని బీటౌన్ టాక్.

# తెరపైకి మరో రామాయణ కావ్యం




భారతీయ ఇతిహాసం రామాయణాన్ని వెండితెరపై మరోసారి ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుంది జాతీయ అవార్డు గ్రహీత, దర్శకురాలు భావనా తల్వార్. ఆమె దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'వాల్మీకి రామాయణం'. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. భక్తి మరియు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్ ప్రస్తుతం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శ్రీరాముడి పాదాలను చూపించడం విశేషం. 'పర్వతాలు ఉన్నంత కాలం, నదులు ప్రవహించినంత కాలం రామాయణం జీవించే ఉంటుంది' అనే శక్తివంతమైన క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. చాలా ఏండ్ల తర్వాత భావనా తల్వార్ మెగాఫోన్ పట్టి ఈ సినిమా తెరకెక్కిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బినోద్ ప్రధాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

# రామ్‌చరణ్ కంటికి స్వల్ప సర్జరీ

డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన చిరు



'పెద్ది' సినిమా షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్ గా రామ్ చరణ్ కంటికి గాయం కావడంతో, మెగా కుటుంబంతో పాటు అభిమానుల్లోనూ కొంత ఆందోళన నెలకొంది. అయితే, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఈ సర్జరీ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా డాక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సమయంలో తమకు కలిగిన ఆందోళనను డాక్టర్ తన మాటలతో, పనితనంతో పోగొట్టారని ఆయన వివరించారు.డాక్టర్ సుధాకర్ ప్రసాద్ గారు, చరణ్ కంటికి మీరు ఎంతో నైపుణ్యంతో, సకాలంలో సర్జరీ చేసినందుకు




ధన్యవాదాలు. తొలుత మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ.. మీరు చెప్పిన మాటలు మా భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇచ్చాయి. సకాలంలో స్పందించి చికిత్స అందించినందుకు కృతజ్ఞతలు అని చిరంజీవి పేర్కొన్నారు. తండ్రిగా తన కొడుకు ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధను, వైద్యుడిపై ఉన్న గౌరవాన్ని ఈ పోస్ట్ ద్వారా చిరంజీవి చాటుకున్నారు. సర్జరీ విజయవంతం కావడంతో రామ్ చరణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల సూచనల మేరకు కొద్దిరోజుల విరామం తర్వాత ఆయన తిరిగి 'పెద్ది' షూటింగ్‌లో పాల్గొననున్నారు. అయితే, మెగాస్టార్ స్వయంగా అప్‌డేట్ ఇవ్వడంతో అభిమానులు ఊపిరి పీల్చుకుని, రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

### శ్రీరామ నవమి సందర్భంగా

## కట్టుదిట్టమైన బందోబస్త్...



గోదావరిఖనిటౌన్//మార్చి 26 (ఆకాంక్ష) : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరిఖని వన్‌టౌన్ శ్రీకోదండ రామాలయంలో రేపు నిర్వహించనున్న శ్రీరామ కల్యాణం సందర్భంగా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఏర్పాట్లను గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ స్వయంగా పరిశీలించారు. పండుగ సందర్భంగా భక్తుల భారీ రద్దీ ఉండే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా మోహరించి, బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, క్యూలైన్ల ద్వారా భక్తులను సజావుగా దర్శనానికి పంపించేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. పండుగ వేళ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

### గుమ్మడిదలలో సీసీ రోడ్ల పనుల ప్రారంభం...



మెదక్//మార్చి 26 (ఆకాంక్ష) : మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి దిశగా కీలక అడుగులు వేస్తూ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా గుమ్మడిదల మండలంలో రూ.50 లక్షల వ్యయంతో మంజూరైన సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్ల నిర్మాణ పనులకు శుభారంభం పలికారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని పనులను సంయుక్తంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి అత్యంత ముఖ్యమని, రహదారుల నిర్మాణంతో ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు కూడా అభివృద్ధి పనులు ప్రారంభించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మానసిక వైకల్యం గల వ్యక్తుల హక్కులపై

## అవగాహన కార్యక్రమం...



నాగర్ కర్నూల్//మార్చి 26 (ఆకాంక్ష) : రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం నాల్సా "లీగల్ సర్వీసెస్ ఫర్ పర్సన్స్ విత్ మెంటల్ ఇల్నెస్ అండ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజబులిటీస్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీ శ్రీరామ్ ఆర్య హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వైకల్యం గల వ్యక్తుల పట్ల సమాజం సహృద్భావంతో మెలిగి, వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. భారతదేశంలో వికలాంగుల హక్కుల చట్టం2016ను పార్లమెంట్ ఆమోదించిన నేపథ్యంలో, ఆ చట్టంలోని హక్కులను అమలు చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని తెలిపారు. వ్యక్తిగత గౌరవం, స్వేచ్ఛ, స్వతంత్ర నిర్ణయాలకు అవకాశాలు కల్పించడంలో ఎలాంటి వివక్ష చూపరాదని అన్నారు. వ్యక్తుల మధ్య ఉండే తేడాలను మానవ వైవిధ్యంగా అంగీకరించి గౌరవించాలని, వైకల్యం గల వ్యక్తులపై హింస, క్రూర ప్రవర్తన, అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని జైలు శిక్ష విధించబడుతుందని హెచ్చరించారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల సమయంలో ఇతరులతో సమానంగా వారికి రక్షణ, భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైకల్యం గల వ్యక్తులకు ఓటు హక్కు సహా అన్ని పౌర హక్కులు సమానంగా ఉన్నాయని, కుటుంబ నియంత్రణ, సంతానోత్పత్తి అంశాలపై సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14416, అలాగే న్యాయ సలహాల కోసం 15100 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ...

### బీజేపీ ఎంపీ అరుణమ్మ సహకారంతో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేత...



జడ్చర్ల//మార్చి 26 (ఆకాంక్ష) : జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. బోయినపల్లి గ్రామానికి చెందిన నాగిళ్ల సురేష్, సామ స్వప్నలకు బీజేపీ ఎంపీ అరుణమ్మ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 26,500 చెక్కులను అందజేశారు. మిడ్జిల్ మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ప్రజలకు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఉపయుక్తమని తెలిపారు. ఎంపీ అరుణమ్మ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలుస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నరేందర్, సురేష్, మల్లేష్, నరేష్ చారి, అరవింద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో 100% పన్ను వసూళ్లపై కట్టుదిట్టమైన చర్యలు...

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశాలు...



పెద్దపల్లి,//మార్చి 26 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలో గ్రామ స్థాయిలో ఆస్తి పన్ను వసూళ్లను 100 శాతానికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీ శాఖకు సంబంధించిన అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న ప్రతి నిర్మాణానికి సంబంధించి అసెస్మెంట్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని, ప్రతి ఇంటి నుంచి ఆస్తి పన్ను తప్పనిసరిగా వసూలు చేయాలని స్పష్టం చేశారు. పన్ను వసూళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. గ్రామాలలో అనుమతి లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అటువంటి నిర్మాణాలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. మండల కేంద్రాల్లో ఉన్న అన్ని వ్యాపార సంస్థల పూర్తి వివరాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఆస్తి పన్ను చెల్లించని రైస్ మిల్లర్లు, ఇతర వాణిజ్య సంస్థలపై కఠిన చర్యలు తీసుకుని అవసరమైతే మూసివేయాలని హెచ్చరించారు. ఆర్టీసీ బస్ స్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు కూడా పన్ను చెల్లించాల్సిందేనని స్పష్టం చేస్తూ, పెండింగ్‌లో ఉన్న వారందరికీ డిమాండ్ నోటీసులు జారీ చేయాలని పేర్కొన్నారు. గ్రామాలలో ఉన్న అక్రమ నిర్మాణాలను రెగ్యులరైజ్ చేయించాల్సి ఉండగా, లేదంటే తొలగించే చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా నిరంతరం శుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, మద్యం దుకాణాల వద్ద చెత్త కనిపిస్తే భారీ జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ సభలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభలో గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రజలకు స్పష్టంగా వివరించాలని అన్నారు. గ్రామ సభపై ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఏప్రిల్ 16న మండల స్థాయిలో జరిగే కార్యక్రమంలో స్వశక్తి మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ, ఇతర శాఖల ఆస్తుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, స్థానిక ప్రజాప్రతినిధులను విస్తృతంగా భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డీఎల్‌పీవోలు, ఎంపీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అవసరమైన అన్ని ప్రాంతాల్లో బస్ స్టాపులు ఏర్పాటు చేయాలి...

### కొత్త బస్ సర్వీసులు ప్రారంభించాలి...

### జడ్చర్లకు బస్ డిపో మంజూరు చేయాలి...



జడ్చర్ల//మార్చి 26 (ఆకాంక్ష) : జడ్చర్ల నియోజకవర్గంలో ప్రజా రవాణా వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేల సమావేశంలో ఆయన వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలో పెరుగుతున్న ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త బస్ రూట్లు మంజూరు చేయాలని, ఇప్పటికే ఉన్న బస్టాండ్లను ఆధునీకరించి ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా జడ్చర్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లోకి బస్సులు రాకపోకలు జరగేలా చర్యలు తీసుకోవాలని, కొత్త బస్టాండ్‌ను ఆధునీకరించి ప్లాట్‌ఫారమ్‌ల సంఖ్యను పెంచాలని కోరారు. రాజాపూర్ మండలంలో రంగారెడ్డి గూడ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని, అక్కడి నుంచి అగ్రహారం పొట్లపల్లి, కల్లేపల్లి, మోదంపల్లి, ఈద్గానిపల్లి, మల్లేపల్లి మీదుగా రాజాపూర్ వరకు కొత్త బస్ రూటు ప్రారంభించాలని అభ్యర్థించారు. అలాగే రాజాపూర్ నుంచి కుచ్చర్కల్, చెన్నవెల్లి, తిర్మలాపూర్, దోండ్లపల్లి, కుత్నేపల్లి మీదుగా నవాబుపేటకు బస్ సర్వీస్ ఏర్పాటు చేయాలని సూచించారు. మిడ్జిల్ మండలంలో బైరంపల్లి- కంచనపల్లి- దోనూరు- వస్పుల్- వల్లభరావుపల్లి- రాణిపేట వరకు ఒక రూటు, చిల్వేర్ అయ్యవారిపల్లి వెలుగొమ్ముల-కొత్తూరు-మల్లాపూర్-మిడ్జిల్ వరకు మరో రూటు, మిడ్జిల్ నుంచి వాడ్యాల వేముల మసిగుండ్లపల్లి చెన్నవల్లి వెంకటాపూర్ అంతారం-వెల్జాల మీదుగా హైదరాబాద్ వరకు మరో రూటు ప్రారంభించాలని కోరారు. నవాబుపేట మండలంలో జడ్చర్ల-నవాబుపేట-కారూర్ -ఇప్పటూర్ -యన్మన్‌గండ్ల- మహబూబ్‌నగర్ వరకు ఒక కొత్త రూటు, షాద్‌నగర్ ఉడిత్యాల-నవాబుపేట-మహబూబ్‌నగర్ వరకు మరో రూటు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా రాజాపూర్ నుంచి లోకిరేవు మీదుగా నవాబుపేట వరకు అలాగే రాజాపూర్ దోండ్లపల్లి లోకిరేవు నవాబుపేట వరకు కొత్త రూట్లు మంజూరు చేయాలని కోరారు. జడ్చర్ల పట్టణంలోని నిమ్మబాయిగడ్డ, ప్రభుత్వ ఆసుపత్రి, హౌసింగ్ బోర్డు కాలనీల వద్ద బస్ స్టాపులు ఏర్పాటు చేయాలని, గంగాపూర్ మార్గంలో బస్ సర్వీసులను పెంచాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. నియోజకవర్గ ప్రజల చిరకాల డిమాండ్ మేరకు జడ్చర్లలో బస్ డిపో మంజూరు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. అలాగే చెన్నవెల్లి, రాజాపూర్, కుచ్చర్కల్, కారూర్, ఇప్పటూరు, చెన్నారెడ్డిపల్లి, యన్మన్‌గండ్ల, రుద్రారం, కాకర్లపాడు తదితర గ్రామాల్లో బస్ స్టాపులు ఏర్పాటు చేయాలని కోరారు. బాలానగర్ మండలంలోని పలు గ్రామాలు, తాండాల్లో కూడా బస్ స్టాపుల అవసరాన్ని వివరించారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సూచనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో జడ్చర్ల నియోజకవర్గంలో ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి వేగం చేకూరనున్నట్లు తెలుస్తోంది.

### గోదావరిఖని లో ఏప్రిల్ 4 నుండి

## రేణుక ఎల్లమ్మ ప్రథమ వార్షికోత్సవం...

### బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించాలి...

### ఆలయ చైర్మన్ హనుమంతు గౌడ్...




గోదావరిఖని//మార్చి 26 (ఆకాంక్ష) : గోదావరిఖని పట్టణంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏప్రిల్ 4 నుండి 7 వరకు నిర్వహించనున్న బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు హనుమంతు గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గౌడ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ, గత సంవత్సరం ఏప్రిల్ నెలలో రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, బోనాల కార్యక్రమాలను వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా అదే ఉత్సాహంతో ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ, ఏప్రిల్ 4న ఆలయ ప్రథమ వార్షికోత్సవం, 5వ తేదీ ఉదయం 10 గంటలకు పోచమ్మ బోనాలు, 6న పుట్టద్వని, 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఎల్లమ్మ మారుబోనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌడ కులస్తులకు కులదైవం మాత్రమే కాకుండా ఊరిదేవతగా పూజలు అందుకుంటున్న రేణుక ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవాల్లో పట్టణ ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా మహిళలు బోనాలతో పెద్దఎత్తున తరలిరావాలని, గౌడ కుటుంబాలతో పాటు అన్ని కులాల ప్రజలు, బంధువులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఈ వేడుకలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో గౌడ సంఘం నాయకులు కోట రవి గౌడ్, వంగ శ్రీనివాస్ గౌడ్, బాలసాని స్వామి గౌడ్, మంద రమేష్ గౌడ్, పొన్నం విజయ్ కుమార్ గౌడ్, గడ్డం రవి, పొన్నం అంజయ్య, మూల అశోక్, కదిరే సత్తయ్య గౌడ్, బిందే నాగభూషణం, మాచిడి మహేందర్ గౌడ్, యాదగిరి, భాస్కర్, బాలసాని కొమురయ్య, సత్తయ్య, శ్రీనివాస్, జనార్ధన్ గౌడ్, మోడం సురేందర్, ముక్క రాజయ్య గౌడ్, కృష్ణమూర్తి, రాజయ్య, గోపి, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖని 54వ డివిజన్‌లో చెత్త సమస్య తీవ్రం

### సానిటరీ అధికారుల నిర్లక్ష్యం పై కాలనీవాసుల ఆగ్రహం...



గోదావరిఖని//మార్చి 26 (ఆకాంక్ష) : గోదావరిఖని పట్టణంలోని 54వ డివిజన్‌లో సింగరేణి క్వార్టర్స్ గల్లీలో పరిశుభ్రత సమస్య తీవ్రరూపం దాల్చింది. మహావీర్ యూత్ ఎదురు భాగంలో ఉన్న ఈ గల్లీలో గత నాలుగు వారాలుగా చెత్త పేరుకు పోయి ఉన్నప్పటికీ సానిటరీ సిబ్బంది పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం, పలుమార్లు సంబంధిత పరిశుభ్రత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. గల్లీలో చెత్త పేరుకు పోవడంతో దుర్వాసన భరించలేని స్థాయికి చేరిందని అక్కడి నుంచి నడవడానికే ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి, కాలనీ వాసులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. వెంటనే సింగరేణి అధికారులు స్పందించి గల్లీ శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ సమస్యపై రామగుండం మేయర్ మంకాళి స్వామికి సమాచారం అందించినట్లు స్థానికులు తెలిపారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మేయర్ హెచ్చరించినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా స్థానిక కార్పొరేటర్ వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. గల్లీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రతి ఇంటి వద్ద చెత్త డబ్బాలు ఏర్పాటు చేసి చెత్తను కేవలం చెత్త బండిలోనే వేయాలని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కారం చూపాలని దండే యశ్వంత్ గౌడ్ కోరారు.

### గోదావరిఖనిలో "అరైవ్ అలైవ్"

## రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం...




గోదావరిఖనిటౌన్ //మార్చి 26 (ఆకాంక్ష) : గోదావరిఖని పరిధిలో రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో పోలీసులు చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమం మూడవ దశలో భాగంగా గురువారం కుందనపల్లిలోని ఐఓసీఎల్ డిపోలో ట్యాంకర్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంతర్గాం ఎస్ఐ వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొని ట్యాంకర్ డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత ఉందని ఏసీపీ తెలిపారు. ముఖ్యంగా ట్యాంకర్ డ్రైవర్లు దీర్ఘదూర ప్రయాణాలు చేసే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, అలసటతో వాహనం నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా వేగ పరిమితులను కచ్చితంగా పాటించడం, సీటు బెల్ట్ ధరించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించడం, మద్యం సేవించి వాహనం నడప కూడదని స్పష్టం చేశారు. భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్యాంకర్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణిస్తామని హామీ ఇచ్చారు. పోలీసులు చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం డ్రైవర్లలో రోడ్డు భద్రతపై చైతన్యం కలిగించడంలో ఉపయోగ పడిందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

### శ్రీరామనవమి సందర్భంగా

## కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాట్లు...

### గోదావరిఖని ఏసీపీ రమేష్ పరిశీలన...



గోదావరిఖని//మార్చి 26 (ఆకాంక్ష) : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరిఖని వన్‌టౌన్‌లోని శ్రీకోదండ రామాలయంలో నిర్వహించనున్న శ్రీరామ కళ్యాణోత్సవానికి సంబంధించి భద్రతా ఏర్పాట్లను గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ గురువారం సమగ్రంగా పరిశీలించారు. పండుగ సందర్భంగా భక్తుల భారీ రద్దీ ఉండే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా మోహరించి, బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, క్యూలైన్ల ద్వారా భక్తులను క్రమబద్ధంగా దర్శనానికి అనుమతించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. పండుగ వేళ శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తండాలో తీరనున్న నీటి కొరత...



నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 26 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మీట్య తండాలో నెలకొన్న నీటి కొరత సమస్యకు పరిష్కారం లభించింది. వేసవి కాలంలో నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న తండా వాసులకు కొత్తగా తవ్వించిన బోర్‌బావిలో సమృద్ధిగా నీరు రావడంతో ఊరట లభించింది.గ్రామ సర్పంచ్ పుల్యా నాయక్ ముందడుగు వేసి బోర్‌బావి తవ్వించగా, మూడు ఇంచులకు పైగా నీరు లభించడం స్థానికుల్లో ఆనందం నింపింది. ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండి, ఎప్పుడూ వారికి అండగా ఉంటానని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జ్యోతి, వార్డు సభ్యులు చంద్రు, నార్య, పాండు, కేలి, గమ్లి, మాజీ సర్పంచ్ శాంతి తదితరులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

# రామగుండం జనరల్ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ...

అవసరమైన పరికరాల ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ ఆదేశాలు...



గోదావరిఖని//మార్చి 26 (ఆకాంక్ష) : రామగుండం జనరల్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన పరికరాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు విభాగాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అవుట్ పేషెంట్ విభాగం, క్రిటికల్ కేర్ సెంటర్, ఎస్.ఎన్.సి.యూ, ఎక్స్‌రే విభాగం, అల్ట్రాసౌండ్, చిన్నపిల్లల విభాగం, ఫిజియోథెరపీ విభాగాలను కలెక్టర్ సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసి, మరింత మెరుగుపర్చాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు.ఆసుపత్రిలో అవసరమైన పరికరాల కొరతను దృష్టిలో ఉంచుకుని అదనంగా ఒక ఎక్స్‌రే యంత్రం, అల్ట్రాసౌండ్ సదుపాయం ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఫిజియోథెరపీ విభాగం సమర్థవంతంగా నడపడానికి అవసరమైన సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.సదరం విభాగంలో చేపట్టిన ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. న్యూ బ్లాక్‌లోని అవుట్ పేషెంట్ గదులను కూడా పరిశీలించి, వైద్యులు సమయానికి విధులకు హాజరై రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో శుభ్రత, సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.తనిఖీ అనంతరం ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో గోదావరిఖనిలో నిర్మించిన ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, నిర్వహణపై వివరాలు తెలుసుకుని అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు.ఈ పర్యటనలో వైద్య అధికారులు డాక్టర్ అరుణ, డాక్టర్ కృపా భాయ్, డాక్టర్ రాజు, నర్సింగ్ పర్యవేక్షకులు మరదలినతో పాటు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణిని కాపాడుదాం

కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రతను రక్షించుదాం...

ఐఎఫ్టియు నేత ఎస్. వెంకటేశ్వరరావు...



గోదావరిఖని// మార్చి 26 (ఆకాంక్ష) : సింగరేణి సంస్థ మనుగడను కాపాడుకోవాల్సిన అవసరం అత్యంత కీలకంగా మారిందని, కార్మికుల హక్కులు మరియు ఉద్యోగ భద్రతను రక్షించేందుకు అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ముందుకు రావాలని ఐఎఫ్టియు గౌరవ అధ్యక్షులు ఎస్. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఐఎఫ్టియు కార్యాలయంలో ఐ. కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి బొగ్గుగనుల అమ్మకాల ప్రక్రియ సంస్థ భవిష్యత్తుకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వేలంలో పాల్గొనేందుకు ప్రభుత్వ అనుమతి ఇవ్వడం అనేది సింగరేణి సంస్థను సజీవ సమాధి చేయడమేనని విమర్శించారు. యాజమాన్యం కార్మికులపై ఒత్తిడి పెంచుతూ, సేఫ్టీ నియమాలను విస్మరిస్తోందని, దీంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆరోపించారు.మెడికల్ బోర్డు శాశ్వత జబ్బులతో బాధపడుతున్న కార్మికులను కూడా ఫిట్‌గా ప్రకటించడం అన్యాయమని, దీనిపై గతంలోనే ఐఎఫ్టియు అభ్యంతరం తెలిపిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కోర్టు కూడా యాజమాన్యం వైఖరిని తప్పుపట్టిందని పేర్కొన్నారు. 150 మాస్టర్ల సమస్య, వారసులకు ఉద్యోగాల విషయంలో జరుగుతున్న ఆలస్యం, వేధింపులు తీవ్రంగా ఉన్నాయని అన్నారు.ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం, భూపాలపల్లి, బెల్లంపల్లి ప్రాంతాల్లో కొత్త గనులను సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి మనుగడ మరియు కార్మికుల సమస్యలపై ఐక్య ఉద్యమాన్ని నిర్మించేందుకు గత 10 నెలలుగా ఐఎఫ్టియు కృషి చేస్తోందని తెలిపారు.ఈ నేపథ్యంలో ఏఐటియుసి నిర్వహిస్తున్న "సేవ్ సింగరేణి జాతా" కార్యక్రమం న్యాయసమ్మతమని, దీనికి ఐఎఫ్టియు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని చెప్పారు. సింగరేణి పరిరక్షణ కోసం అన్ని కార్మిక సంఘాలు భేదాభిప్రాయాలు పక్కనపెట్టి ఒకే వేదికపైకి వచ్చి బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రటరీ జే. సీతారామయ్యతో పాటు ఏ. వెంకన్న, ఎండి. రాసుద్దిన్, డి. బ్రహ్మానందం, ఈదునూరి రామకృష్ణ, కాపు కృష్ణ, తోట్ల రాయమల్లు, సంతు, సంజీవరావు, నాసర్, పాషా, నరేష్, జి. నాగేశ్వరరావు, రాజేశం, తోడేటి నాగేశ్వరరావు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు భక్తులకు మున్నూరు కాపు తాలూకా

# సంఘం వారిచే అన్నప్రసాద పంపిణీ...




నాగర్ కర్నూల్//మార్చి 26 (ఆకాంక్ష) : శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ లోగల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో జరిగే శ్రీరామనవమి కళ్యాణోత్సవం అనంతరం దర్శించుకున్న భక్తులందరికీ నాగర్ కర్నూల్ తాలూకా మున్నూరు కాపు సంఘం వారిచే అన్నప్రసాద పంపిణీ ఏర్పాటు చేసినట్లు సంఘం తాలూకా అధ్యక్షుడు తీగల సుభాష్ , కార్యదర్శి పాలమూరు సతీష్ ,కోశాధికారి తీగల జగదీష్ లు తెలిపారు. అధ్యక్షుడు తీగల సుభాష్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా శ్రీరామ నవమి పురస్కరించుకొని టీటీడీ కళ్యాణ మండపంలో భక్తులందరికీ అన్న ప్రసాదం పంపిణీ ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సంవత్సరం 6వేల మంది పైగా భక్తులకు సంపూర్ణ అన్నప్రసాద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.భక్తులు సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించాలని వారు కోరారు.మరిన్ని వివరాలకు 9985221162, 9966671731లో సంప్రదించాలన్నారు.

## కంటి శిబిరంలో 86 మందికి పరీక్షలు,

# 41 మందికి కంటి ఆపరేషన్లు....



నాగర్ కర్నూల్//మార్చి 26 (ఆకాంక్ష) :నాగర్ కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా గురువారం పాత కలెక్టరేట్ భవనం 102 గదిలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరం విజయవంతమైనట్లు నాగర్ కర్నూల్ జిల్లా అందత్వ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హెచ్.ప్రదీప్ తెలిపారు.ఈ శిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన86 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో అర్హులైన క్యాటరాక్ట్ పొరగల 41 మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్ లో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు. రోగులకు ఆప్తాలమిక్ అధికారి కోట్ర బాలాజీ ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వై. శ్రీనివాసులు, సుకుమార్ రెడ్డి, నరసింహ, చెన్నకేశవులు,ప్రకాష్, సురేష్,ఎన్.వెంకటేశ్వర చారి,సురేష్ చారి, కళ్యాణ్,సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మబిక్షం వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు...

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సిపిఐ నాయకుల స్మరణ సభ...




నాగర్ కర్నూల్//మార్చి 26 (ఆకాంక్ష) : ప్రఖ్యాత స్వాతంత్ర సమరయోధుడు, గీత పనివారల సంఘం వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం గారి 15వ వర్ధంతి సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఘనంగా నివాళులు అర్పించారు.జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ ధర్మబిక్షం గారి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో పాటు తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర వర్గ సభ్యులు కౌకుంట్ల కేశవులు గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎం బాల నరసింహ మాట్లాడుతూ కామ్రేడ్ ధర్మబిక్షం గారు స్వాతంత్రానికి పూర్వమే సమాజ సేవలో నిమగ్నమై నిరుపేద విద్యార్థుల కోసం సూర్యాపేటలో హాస్టల్ ఏర్పాటు చేసి వారికి విద్యను అందించిన విద్యావేత్తగా నిలిచారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.అలాగే సూర్యాపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలందించిన ధర్మబిక్షం గారు అనంతరం రెండు పర్యాయాలు ఎంపీగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారని చెప్పారు. ఫ్లోరైడ్ బాధితుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం కృషి చేసిన మహానేతగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు.ధర్మబిక్షం ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేపట్టడమే ఆయనకు నిజమైన నివాళులని ఎం బాల నరసింహ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సూర్య శంకర్ గౌడ్,మారేడు శివశంకర్, గీత పనివారల సంఘం జిల్లా నాయకులు రామన్ గౌడ్, సురేందర్ గౌడ్, కృష్ణయ్య గౌడ్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేసు మల్ల శివకృష్ణ, అనంత శ్రీనివాసులు, కపిలవాయి గోపిచారి, దాంగట్ల వెంకటస్వామి, ఈర్ల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ బస్ స్టేషన్ శంకుస్థాపనకు

# తేదీ ఖరారు చేయాలి...

ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి...



నాగర్ కర్నూల్//మార్చి 26 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ పట్టణ అభివృద్ధికి కీలకమైన కొత్త బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన తేదీని తక్షణమే ఖరారు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో నిర్వహించిన టీజీ ఆర్టీసీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని నియోజకవర్గ రవాణా సమస్యలను విపులంగా ప్రస్తావించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగర్ కర్నూల్‌కు మంజూరైన ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల రాకపోకలకు ఈ బస్ స్టేషన్ ఎంతో ఉపయోగకరమవుతుందని పేర్కొన్నారు.ఇక తెల్కపల్లి, తిమ్మాజీపేట ప్రాంతాల్లో ఉన్న బస్సు డిపోల దుస్థితిని వివరించిన ఎమ్మెల్యే, అక్కడి మౌలిక వసతులను మెరుగుపరచి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. అదేవిధంగా నాగర్ కర్నూల్ నుండి నల్గొండకు కొత్త బస్సు సర్వీసును ప్రారంభించాలని,నియోజకవర్గంలోని పలు కీలక రూట్లలో బస్సుల సంఖ్యను పెంచాలని ప్రజల విన్నపాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ (ఖూూ), టీజీ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి (ఖూూ) తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వినిపించిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నాగర్ కర్నూల్ ప్రాంతంలో రవాణా సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# బిజినేపల్లి మండలంలో బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి...

సిపిఎం డిమాండ్...




నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 26 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలోని గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే అరికట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం బిజినేపల్లి మండలంలో నిర్వహించిన సిపిఎం సమావేశంలో ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని, ముఖ్యంగా కల్తీ మద్యం విక్రయం పెరుగుతుండడం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని అన్నారు. ఈ విషయంపై మండల పోలీసు శాఖ, ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం బాధాకరమని విమర్శించారు.గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహకులను ప్రశ్నిస్తే, "ఎవరికి ఇవ్వాల్సిన మామూలు వాళ్లకి ఇస్తున్నాం, మా వ్యాపారం ఇలాగే కొనసాగుతుందని బహిరంగంగానే సమాధానం ఇస్తున్నారని తెలిపారు. ఇది అధికార యంత్రాంగంపై ప్రజల్లో నమ్మకం తగ్గించే పరిస్థితి తీసుకువస్తుందని అన్నారు.కల్తీ మద్యం కారణంగా గ్రామాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు మరియు ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించి బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సిపిఎం నాయకులు చంద్రశేఖర్, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉడుగులకుంట తండాలో

# ఉచిత గాలికుంటు నివారణ టీకాలు...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 26 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఉడుగులకుంట తండాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవిత మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి పశువులకు అత్యంత ప్రమాదకరమని, ముందస్తు టీకాలు వేయించుకోవడం ద్వారా పెద్ద నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు.గ్రామ సర్పంచ్ బుజ్జి చందూలాల్ మాట్లాడుతూ పశుసంపదను కాపాడుకోవడం రైతుల ఆర్థికాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆవులు, ఎద్దులు తదితర పశువులకు ఉచితంగా టీకాలు వేశారు.పశు వైద్య సిబ్బంది గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పశువులకు టీకాలు వేయించుకున్నారు.

# రాఘవాపూర్‌లో విద్యుత్ ఆర్టిజన్ల గర్జన

భారీ ధర్నాతో డిమాండ్ల సాధనకు సంకల్పం...



పెద్దపల్లిటౌన్//మార్చి 26 (ఆకాంక్ష) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఆర్టిజన్ల సమస్యల పరిష్కారానికి గళమెత్తిన కార్మికులు పెద్దపల్లి జిల్లాలో గర్జించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మొదటి రోజు నిరసనలో భాగంగా రాఘవాపూర్ డివిజన్ కార్యాలయం ముందు విద్యుత్ ఆర్టిజన్ ఆన్ మ్యాన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన కార్మికులు నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు.ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 19,600 మంది ఆర్టిజన్లకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న స్టాండింగ్ ఆర్డర్ కార్మికులకు వ్యతిరేకంగా ఉందని, దానిని తక్షణమే రద్దు చేసి పాత ా్యూజుదీ నిబంధనలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.కార్మికుల ప్రధాన డిమాండ్లలో ఆన్ మ్యాన్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి సంస్థలో విలీనం చేయడం ముఖ్యమని తెలిపారు. అలాగే స్పాట్ బిల్లర్స్, పీస్ రేటు కార్మికులు, ఖ్రావీ కార్మికులను కూడా వెంటనే విలీనం చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ ధర్నాకు విద్యుత్ శాఖలోని పలు యూనియన్లు సంఘీభావం ప్రకటించాయి. జాయింట్ సెక్రటరీ ఆది కొండల్ రావు, నాయకులు మారుపాక తిరుపతి, జూపాక వెంకటేష్, ఇరుగురాల రమేష్ తదితరులు మాట్లాడుతూ కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ఈ నిరసనలో కార్మిక నాయకులు హాజర్, రవీందర్ రెడ్డి, కుమార్, శ్రీరాములు, ప్రకాష్, గణేష్, శంకర్, రాజు, రాజేందర్, చిన్నయ్యలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# రామాలయంలో వైభవంగా గరుడ సేవ ధ్వజారోహణం...



నాగర్ కర్నూల్//మార్చి 26 (ఆకాంక్ష) : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో గురువారం భక్తిశ్రద్ధల మధ్య ధ్వజారోహణం, గరుడ సేవ, బేరీ పూజలు వైభవంగా నిర్వహించబడినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ తెలిపారు.ఈ సందర్భంగా వేదమూర్తులైన బ్రాహ్మణ అర్చక బృందం చక్రవర్తి శ్రీనివాసాచార్యులు, కందాడై శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించగా, దేవత ఆహ్వానం కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం సామూహికంగా నిర్వహించబడింది. శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులకు అనుకూలంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయబడగా, ఆలయ ఆవరణలో సేవా కార్యక్రమాల కోసం స్టాళ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో గరుడవాహన సేవ, ఎదుర్కొల్లు, కోలాటం, ప్రత్యేక భజనలు మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉద్దీపన చేశారు.శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని అర్చకులు తెలిపారు. అదే రోజు భక్తుల సమక్షంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.తాలూకా మున్నూరు సంఘం యువత ఆధ్వర్యంలో కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ టిటిడి కళ్యాణ మండపం ఆవరణలో ఉచిత అన్నప్రసాద పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారికి సమర్పణ నిమిత్తం భక్తులు అక్షింతలు, వడివ బియ్యం, వస్త్రాలు, తలంబ్రాలు, పూలు, పండ్లు తమ వెంట తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో శ్రీరామనవమి ఉత్సవ కమిటీ సభ్యులు, రామాలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, భక్తులు భారీగా పాల్గొని స్వామి వారికి సేవలందించారు. భక్తి, భజనల మధ్య ఆలయం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడింది.

# తిరుమలలో ప్రముఖుల దర్శనం..

స్వామివారి ఆశీస్సులు పొందిన ఏపీ మిథున్ రెడ్డి దంపతులు...



షాద్‌నగర్//మార్చి 26 (ఆకాంక్ష) : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వర స్వామివారి దర్శనార్థం తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రముఖులు తరలివచ్చారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి దంపతులు గురువారం తిరుమలలో స్వామివారిని నిజరూప దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీ మిథున్ రెడ్డి దంపతులతో పాటు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి మనవడు, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కుమారుడు కోట్ల రాఘవేందర్ రెడ్డి దంపతులు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. వీరితో పాటు టాలీవుడ్ ప్రముఖ సినీ నటుడు శర్వానంద్ తదితరులు కూడా తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.దర్శనానంతరం ఏపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ, కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణలో ప్రభుత్వం దీర్ఘకాలం ప్రజాసేవలో నిలవాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన సుదీర్ఘంగా కొనసాగాలని స్వామివారి ఆశీస్సులు కోరుకున్నట్లు వెల్లడించారు.తిరుమలలో ప్రముఖుల రాకతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. భక్తుల రద్దీ మధ్య భక్తిశ్రద్ధలతో స్వామివారి దర్శనం కొనసాగింది.

# కేజీబీవీ బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 26 (ఆకాంక్ష) : కేజీబీవీ బాలికల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ ఆదేశించారు. గురువారం పెద్దకొత్తపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన అవసరాన్ని సిబ్బందికి గుర్తు చేశారు.పాఠశాలలోని వంటగది, నిల్వ గదులను పరిశీలించిన అదనపు కలెక్టర్ స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి, సరుకులు వచ్చిన ప్రతిసారి మెస్ కమిటీ విద్యార్థుల సంతకాలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాల గడువు తేదీలను క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన ఆయన, ఎస్ఎస్–సీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ, భయం లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. పీఎం శ్రీ పథకం పనులపై సమీక్ష నిర్వహించి, అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని అధికారులను ఆదేశించారు.బాలికల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారం, మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఏఎన్ఎంలు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిఇఓ రమేష్ కుమార్, జిసిడిఓ శోభారాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో మసీదు నిర్మాణం...

భూమి పూజ నిర్వహించిన సర్పంచ్ మాధవి...



జడ్చర్ల//**మార్చి 26 (ఆకాంక్ష) :** గ్రామంలో మసీదు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తన సొంత నిధులతో పీర్ల మసీదు నిర్మాణం చేపడతానని చెప్పిన రాణిపేట్ గ్రామ సర్పంచ్ మాధవి (మల్లేష్) మాట నిలబెట్టుకున్నారు. గురువారం నాడు నూతన పీర్ల మసీదు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించగా, ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మత పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం...



పెద్దపల్లి//**మార్చి 26 (ఆకాంక్ష) :** విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తూ సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణలోనూ కృషి చేస్తున్న పెద్దపల్లి జిల్లా రామగుండం మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గూళ్ళ అంజన్ కుమార్ జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకుని గౌరవం పొందారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్, వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ జీవన సాఫల్య జాతీయ పురస్కారాన్ని ఆయనకు ఘనంగా ప్రధానం చేశారు. తెలంగాణ భాష శాశ్వత శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఈకార్యక్రమం జరిగింది. గూళ్ళ అంజన్ కుమార్ విద్యారంగంలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ విశేషంగా పనిచేస్తున్నారు. తెలంగాణ జీవశాస్త్ర ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా, నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా కోఆర్డినేటర్‌గా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా, సామాజిక సేవా కార్యకర్తగా ఆయన సేవలందిస్తున్నారు. అలాగే ఎన్నికల సమయంలో మాస్టర్ ట్రైనర్‌గా, నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా, జిల్లా విద్యాశాఖ విద్యార్థి మోటివేటర్‌గా ఉత్తమ సేవలను అందిస్తున్నారు. జాతీయ పురస్కారం అందుకున్న సందర్భంగా జిల్లాలోని పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అంజన్ కుమార్‌ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఒక్క ఓటు తేడాతో షాద్ నగర్ బార్ అసోసియేషన్

# అధ్యక్షుడిగా బి. జగన్మోహన్ రెడ్డి విజయం...

ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి ఏకగ్రీవం...

ఉత్కంఠభరితంగా ముగిసిన ఎన్నికలు...



షాద్ నగర్//**మార్చి 26 (ఆకాంక్ష) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో బి. జగన్మోహన్ రెడ్డి కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించి నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన సమీప ప్రత్యర్థి, మాజీ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు ఒకే ఒక్క ఓటుతో ఓటమి చెందడం విశేషం. గురువారం నిర్వహించిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా మఱ్రి శంకరయ్య వ్యవహరించారు. అధ్యక్ష పదవికి మొత్తం నలుగురు అభ్యర్థులు పోటీపడగా, బి. జగన్మోహన్ రెడ్డికి 67 ఓట్లు లభించాయి. నర్వ వేణుగోపాలరావుకు 66 ఓట్లు వచ్చి రెండో స్థానంలో నిలిచారు. దానక్క సంగమేశ్వర్ 23 ఓట్లు సాధించగా, సీనియర్ న్యాయవాది రజాక్ హుస్సేన్‌కు 5 ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా రహీముద్దీన్‌కు 108 ఓట్లు లభించగా, గేమ్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా డి. శంకర్ 102 ఓట్లు సాధించారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజేతలను న్యాయవాదులు అభినందించారు. కొత్త కమిటీ న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేయాలని సభ్యులు ఆకాంక్షించారు.

# ఓదెల గ్రామంలో వారసంత వేలం ప్రకటన విడుదల...




ఓదెల//**మార్చి 26 (ఆకాంక్ష) :** ఓదెల గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించబడుతున్న వారసంత (వారాంతపు మార్కెట్) నిర్వహణకు సంబంధించి గ్రామపంచాయతీ పాలకవర్గం అధికారికంగా వేలం ప్రకటనను విడుదల చేసింది. గ్రామ అభివృద్ధి, ఆదాయ వనరుల పెంపుదల దృష్ట్యా ఈ వారసంత వేలం నిర్వహణకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మాట్లాడుతూ, ఈ నెల 30వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వారసంత వేలం నిర్వహించబడుతుందని తెలిపారు. వేలం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడుతుందని, ఆసక్తి గల వ్యాపారులు, వ్యక్తులు ఇందులో పాల్గొనవచ్చని సూచించారు. ఈ వేలానికి ఆఫ్‌సెట్ ధరను రూ. 68,640గా నిర్ణయించినట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనదలచిన వారు సోమవారం ఉదయం 10 గంటలలోపు రూ. 5,000 డిపాజిట్ చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. నియమ నిబంధనలకు లోబడి వేలం నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట లక్ష్మణ్, వార్డు సభ్యులు అప్పని తిరుపతి, రాపెల్లి రాజయ్య, కొండ్ర లక్ష్మణ్, గోపతి ప్రవీణ్, బుద్ధ రవి తదితరులు పాల్గొన్నారు.




# షాద్ నగర్‌లో సీఎంఆర్ చెక్కుల పంపిణీ...

షాద్ నగర్//**మార్చి 26 (ఆకాంక్ష) :** ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం షాద్ నగర్‌లో పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటుగా నిలుస్తోందని తెలిపారు. అవసరమైన వారికి సకాలంలో సహాయం అందేలా తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పి. ప్రవీణ్ కుమార్, కమ్మరి సతీష్ చారి, సికిందర్, అనితా దేవి, గంజి సాయి అభిరామ్, కోగూరు కౌసల్యాదేవి, భాను శర్మ, మునగపాటి ప్రేమ్ కుమార్, మహమ్మద్ అలీముద్దీన్, అబ్దుల్ కరీం తదితరులతో పాటు ఫరూక్ నగర్ మండలం బురుగుల గ్రామానికి చెందిన పాత్లవత్ చందర్, కేతావత్ జ్యోతి, సి. మాధవి, మొగలిగిద్ద గ్రామానికి చెందిన బండి పెంటయ్య, అల్లాడ కృష్ణయ్య, అమీనా బి, ఎం. సత్యానందం, పులిచెర్లకుంట తండాకు చెందిన కొర్ర దశరథ్, కొండన్నగూడ గ్రామానికి చెందిన ఆర్ల దేవేందర్, మధురాపూర్ గ్రామానికి చెందిన నక్కల శేఖర్, పిట్టల గడ్డ తండాకు చెందిన కొడవత్ శివకుమార్, సోలిపూర్ గ్రామానికి చెందిన పి. నారాయణ, కొంగగూడ గ్రామానికి చెందిన అంగోత్ కిషన్, చిలకమఱ్రి గ్రామానికి చెందిన గడ్డం మల్లేష్ యాదవ్, విట్యాల గ్రామానికి చెందిన గడియ రమేష్, చల్క చిలకమఱ్రి గ్రామానికి చెందిన కుమ్మరి సత్యనారాయణ తదితరులకు మొత్తం రూ. 8,98,000 విలువగల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ మాజీ వైస్ ఎంపీపీ హరికృష్ణ గౌడ్, కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్, పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, వీర్లపల్లి సర్పంచ్ పాండు, కందివనం సర్పంచ్ అమృనాయక్, మెల్లగూడ సర్పంచ్ మంగ రవి నాయక్, శేరిగూడ మాజీ సర్పంచ్



ప్రశాంత్ రెడ్డి, మధురాపూర్ మాజీ సర్పంచ్ రంగయ్య గౌడ్, మొగిలిగిద్ద మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణ, విఠ్యాల మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, పెద్ద చిలకమఱ్రి సర్పంచ్ శ్రీశైలం, కాంటెస్టెడ్ కౌన్సిలర్ రాజేందర్ సింగ్, వేదపండితులు భానుశర్మ, పులిచెర్లకుంట తండా ఉపసర్పంచ్ గణేష్, కొండనగూడ ఉపసర్పంచ్ అంజయ్య గౌడ్, సోలిపూర్ మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు గౌడ్, గ్రామ అధ్యక్షుడు రమేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు శేరి శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మేకల రాజు, రాజు యాదవ్, శంకరయ్య గౌడ్, రమేష్ ముదిరాజ్, నరేష్, పాండు నాయక్, అన్వారీ రాజు, వెంకట్ రెడ్డి, మల్లేష్, బాలకృష్ణ, నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ గ్రీన్ కార్ప్స్‌తో ఎంవోయూ కుదుర్చుకున్న నాగర్ కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు...

నాగర్ కర్నూల్//**మార్చి 26 (ఆకాంక్ష) :** విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కీలక ముందడుగు వేశాయి. నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్.జి.సి) తెలంగాణ శాఖతో జిల్లాలోని ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. ఈ విషయాన్ని నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల (నోడల్ డిగ్రీ కళాశాల) ప్రిన్సిపల్ మదన్ మోహన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన నేషనల్ గ్రీన్ కార్ప్స్ తెలంగాణ డైరెక్టర్ డబ్ల్యూ.జి. ప్రసన్న కుమార్‌ను కలిసి భేటీ అయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించడంతో పాటు, విద్యార్థుల భాగస్వామ్యంతో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన ఏర్పడిందన్నారు. ఈ ఎంవోయూ ద్వారా జిల్లాలోని కళాశాలల్లో గ్రీన్ క్లబ్ కార్యకలాపాలు మరింత చురుకుగా కొనసాగనున్నాయి. విద్యార్థుల్లో పచ్చదనం ప్రోత్సాహం, స్వచ్ఛత కార్యక్రమాలు, వృక్షారోపణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రాయోగిక శిక్షణను విద్యార్థులకు అందించేందుకు



చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదనంగా, నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, పర్యావరణ దినోత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొనే అవకాశాలు కల్పించబడనున్నాయి. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా యువతలో పర్యావరణంపై బాధ్యతాభావం పెంపొందించి, సమాజంలో పచ్చదనం పరిరక్షణకు తోడ్పడేలా చేయడం ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. జిల్లాలోని విద్యాసంస్థలు పర్యావరణ పరిరక్షణలో ముందుండేలా ఈ చర్యలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో సలేశ్వరం జాతరకు విస్తృత ఏర్పాట్లు...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 26 (ఆకాంక్ష) :** భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏప్రిల్ 1 నుంచి 3 వరకు నిర్వహించనున్న సలేశ్వరం జాతరకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్ ఆదేశించారు. నల్లమల అడవిలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన ఆయన ట్రెక్కింగ్ మార్గాల్లో భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు మార్గదర్శక సూచికలు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు, వైద్య సేవలు, తాత్కాలిక శిబిరాలు, విశ్రాంతి షెడ్లు, టెంట్లు ఏర్పాటు చేయనున్నారు. భక్తుల రద్దీ నియంత్రణకు మైక్ వ్యవస్థ, పోలీస్ ఔట్‌పోస్ట్‌లతో భద్రత కట్టుదిట్టం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల కోసం వైద్య బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉంచారు. శుభ్రత, చెత్త నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. గర్భిణీలు, వృద్ధులు జాతరకు రాకుండా ఉండాలని, శ్వాసకోశ సమస్యలున్న వారు జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యమని ప్రశాంతంగా స్వామి దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు.

## శాద్ నగర్‌లో శ్రీరామనవమి

# సందర్భంగా శాంతి సమావేశం...

శాంతి సామరస్యం ప్రతి పౌరుడి బాధ్యత...

ఏసీపీ లక్ష్మీనారాయణ...



షాద్ నగర్//**మార్చి 26 (ఆకాంక్ష) :** శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని షాద్ నగర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏసీపీ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా, సీఐ సీతారాం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, సమాజంలో శాంతి సామరస్యం నెలకొల్పడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. పండుగల సమయంలో అందరూ భాయ్ భాయ్‌గా మెలిగి పరస్పర గౌరవంతో వ్యవహరించాలని సూచించారు. రేపు జరగనున్న శ్రీరామనవమి శోభాయాత్రలో క్రమశిక్షణ పాటిస్తూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని విధాలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పట్టణం మొత్తం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, ముఖ్య ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం కీలకమని, అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే పండుగను విజయవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో షాద్ నగర్ పట్టణం మరియు పరిసర ప్రాంతాలకు చెందిన వివిధ మతాల ప్రతినిధులు, మత గురువులు, సామాజిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గౌరవనీయ పౌరులు పాల్గొన్నారు. సీఐ సీతారాం, ఎస్ఐలు సుశీల, శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.

## భారత్‌తో మా దేశ సంబంధాల

# మెరుగుదల సరైన దిశలోనే చైనా విదేశాంగ మంత్రి



**భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌ల వ్యూహాత్మక మార్గదర్శకత్వంలో ఇరుదేశాలు సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నాయన్న విదేశాంగ మంత్రి వాంగ్ యీ**

భారత్, చైనా సంబంధాల మెరుగుదల అనేది సరైన దిశలోనే ఉందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ అన్నారు. ఇరుదేశాల మధ్య వైరుధ్యాల కంటే ఉమ్మడి ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌ల వ్యూహాత్మక మార్గదర్శకత్వంలో ఇరుదేశాలు సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నాయని చెప్పారు. గురువారం బీజింగ్ వేదికగా చైనాలోని భారత రాయబారి ప్రదీప్ రావత్ వీడ్కోలు సమావేశంలో వాంగ్ యీ ఈ వ్యాఖ్యలు చేశారు.

**భారత్‌తో కలిసి పనిచేస్తాం**

అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితులున్న ప్రస్తుత తరుణంలో భారత్‌తో కలిసి పనిచేయాలని చైనా భావిస్తోందని వాంగ్ యీ తెలిపారు. గతంలో మోదీ, జిన్‌పింగ్‌లు అవగాహనకు వచ్చిన విధంగా భారత్, చైనాలు పరస్పరం ముప్పుగా చూసుకోవడానికి బదులుగా అభివృద్ధి అవకాశాలుగా పరిగణించాలన్నారు. ఇరుదేశాలు పోటీదారులుగా భావించుకోవడానికి బదులుగా, పరస్పర భాగస్వాములుగా అనుకోవాలని ఆయన సూచించారు.

**బ్రిక్స్ వల్లే భారత్ - చైనా సంబంధాల్లో సానుకూల పురోగతి**

"భారత్, చైనాలు ప్రధానమైన ప్రపంచ ఆర్థిక శక్తులు. ఈ రెండు దేశాల ఆధునికీకరణ జరగకుంటే, ఈ ప్రపంచం ఆధునికీకరణ జరగనే జరగదు. భారత్‌తో చాలా రంగాల్లో ఉమ్మడి ప్రయోజనపూర్వక సహకారాన్ని విస్తరించాలని చైనా భావిస్తోంది. గ్లోబల్ సౌత్‌కు సంబంధించిన ఉమ్మడి ప్రయోజనాలను పరిరక్షించాలని మేం కోరుకుంటున్నాం. బ్రిక్స్ వంటి వేదికల ద్వారా ప్రపంచ దేశాల మధ్య సహకార భావన పెరగాలని చైనా ఆశిస్తోంది. బ్రిక్స్ కూటమి వల్లే భారత్ - చైనా సంబంధాల్లో సానుకూల పురోగతి చోటుచేసుకుంది. ఈ ఏడాది చివర్లోగా బ్రిక్స్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఈ కూటమిలో భారత్, చైనాలతో పాటు రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. ఈ సదస్సుకు జిన్‌పింగ్ కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి" అని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ తెలిపారు.

**ప్రదీప్ రావత్ సేవలు అభినందనీయం**

"చైనాలోని భారత రాయబారి ప్రదీప్ రావత్ చేసిన సేవలు అభినందనీయం. భారత్ -చైనా సంబంధాల బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారు. ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడంలో సహకరించారు" అని ప్రదీప్ రావత్‌ను ఉద్దేశించి వాంగ్ యీ చెప్పారు. ఈ నెలాఖరులోగా చైనాలోని భారత రాయబారి పదవి నుంచి ప్రదీప్ రావత్ వైదొలగనున్నారు. ఆయన స్థానంలో ప్రస్తుతం యూకేలో భారత రాయబారిగా ఉన్న విక్రమ్ దొరైస్వామి బాధ్యతలను చేపట్టనున్నారు.

**గల్వాన్ ఘర్షణ నుంచి సంబంధాల పునరుద్ధరణ దాకా**

2020 జూన్ 15న తూర్పు లడఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య భీకర ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఒక కల్నల్ సహా మొత్తం 20 మంది భారత జవాన్లు వీరమరణం పొందారు. ఇక చైనా వైపు కూడా పెద్దసంఖ్యలోనే సైనికులు చనిపోయారు. అయితే నలుగురు సైనికులే చనిపోయారని చైనా ప్రకటించింది. ఈ అంశంపై అత్యంత ఆలస్యంగా 2021 ఫిబ్రవరిలో ప్రకటనను విడుదల చేసింది. గల్వాన్ ఘటనతో దాదాపు ఐదేళ్ల పాటు భారత్, చైనా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈనేపథ్యంలో 2024లో రష్యాలోని కజన్ వేదికగా జరిగిన బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, భారత ప్రధాని మోదీ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగింది. ఈ భేటీ అనంతరం మళ్లీ ఇరుదేశాల సంబంధాలు గాడినపడ్డాయి. 2025లో చైనాలోని టియాన్‌జిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సు వేదికగానూ జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. గత రెండేళ్లుగా చైనా, భారత్ మధ్య శాంతియుత రీతిలో సంబంధాలు ముందుకు సాగుతున్నాయి. సరిహద్దుల్లోనూ ఉద్రిక్త వాతావరణం లేదు.